
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
బుధవారం 30 జూలై 2025





# సాగర్ నుంచి సాగరానికి

- 26 గేట్ల ద్వారా దిగువకు నీటి విడుదల
- క్రస్ట్ గేట్ల నుంచి పరవళ్లు తొక్కుతోన్న కృష్ణమ్మ
- ఇన్‌ఫ్లో 2,28,900.. ఔట్‌ఫ్లో 2,47,447 క్యూసెక్కులు
- 18 ఏళ్ల తర్వాత జూలైలో గేట్లు ఎత్తి నీటి విడుదల

నరసరావుపేట, జూలై 29(ఆంధ్రజ్యోతి): పోటెత్తుతోన్న వరదతో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. నాగార్జునసాగర్ జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 590 అడుగులు కాగా 587.40 అడుగులకు చేరి నిండు కుండలా మారింది. పైగా జలాశయానికి వరద ఉధృతి కొనసాగుతోంది. డ్యాంలో నీటి మట్టం పూర్తి స్థాయికి చేరడంతో మంగళవారం సాగర్ క్రస్ట్ గేట్లు ఎత్తారు. దీంతో సాగరం దిశగా కృష్ణమ్మ పరుగులు పెడుతోంది. తెలంగాణ మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, లక్ష్మణ్ మంగళవారం ఉదయం 10 గంటలకు జలాశయం గేట్లు ఎత్తి నీటిని విడుదల చేశారు. సాయంత్రానికి మొత్తం 26 గేట్లను ఐదు అడుగుల మేర ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. డ్యాం పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312.04 టీఎంసీలకు 305.74 టీఎంసీలకు నీటి నిల్వ చేరింది. జలాశయానికి 2,28,900 క్యూసెక్కుల ప్రవాహం ఉంది. సాగర్ 26 గేట్లు ఎత్తి దిగువకు 2.10 లక్షల క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 28,014 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాల్వలకు నీటి విడుదలతో మొత్తంగా 2,47,447 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. భారీగా నీటిని విడుదల చేయడంతో జలాశయం దిగువ ప్రాంతవాసులను అధికారులు అప్రమత్తం చేశారు. నదీ తీరం వైపు వెళ్లకుండా పోలీసు, రెవెన్యూ శాఖలు చర్యలు తీసుకున్నారు. 18 ఏళ్ల తర్వాత జూలై నెలలో గేట్లు ఎత్తిని నీటిని దిగువకు విడుదల చేయడం ఇదే తొలిసారి.

## పులిచింతలకు కృష్ణమ్మ పరవళ్లు



కేఎల్‌రావు పులిచింతల ప్రాజెక్టుకు కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. సాగర్ నుంచి 2.47 లక్షల క్యూసెక్కుల వరద పులిచింతలకు చేరనుంది. ఇక్కడ నుంచి ప్రకాశం బ్యారేజీకు 18,000 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. పులిచింతల పూర్తిస్థాయి నీటి మట్టం 175 అడుగులు కాగా 162.6 అడుగులకు నీటి మట్టం చేరింది. 45.77 టీఎంసీలకు 28.64 టీఎంసీల నీటి నిల్వ ఉంది. రెండు రోజుల్లో పులిచింతల ప్రాజెక్టు కూడా నిండుతుందని జలవనరుల శాఖ అధికారులు తెలిపారు.

# మూల్యాంకన వేతనం మరిచారు..

**పది పరీక్షల మూల్యాంకన వేతనాల చెల్లింపులను విద్యాశాఖ మరిచింది. మూల్యాంకనం జరిగి నాలుగు నెల లైనా ఇంతవరకు చెల్లింపులు జరగ లేదు. సుదూర ప్రాంతాల నుంచి సొంత ఖర్చులు పెట్టుకుని వచ్చిన ఉపాధ్యా యులు మూల్యాంకన వేతనాల కోసం పడిగాపులు కాస్తున్నారు. ఒక్కో ఉపాధ్యాయుడికి సగటున రూ.4 వేల వరకు, సహాయకులకు రూ.2 వేలు చొప్పున చెల్లించాల్సి ఉంది.**

- నాలుగు నెలలైనా విడుదలలో జాప్యం
- ఉపాధ్యాయుల వినతులను పట్టించుకోని విద్యాశాఖ
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో రూ.2 కోట్లకుపైగా బకాయిలు
- గతేడాది పది సప్లిమెంటరీ, దూరవిద్య పరీక్షల చెల్లింపుల్లోనూ నిర్లక్ష్యం

గుంటూరు(విద్య), జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా సుమారు 5 వేల మంది ఉపాధ్యాయులకు దాదాపు రూ2 కోట్లకు పైగా మూల్యాంకన నిధులు విడుదల కావాల్సి ఉందని సమాచారం. వేతన చెల్లింపుల కోసం ఉన్నత, జిల్లా స్థాయిలో అధికారులకు ఎన్నిసార్లు విజ్ఞప్తులు చేసినా వారు పట్టించుకోవడం లేదని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.





### విద్యార్థుల నుంచి వసూలు చేసినా..

మూల్యాంకన చెల్లింపులకు ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు విడుదల చేయాల్సిన అవసరం లేదు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఫీజులు చెల్లిస్తారు. ఇలా వసూలు చేసిన నగదును ప్రశ్నాపత్రాల ముద్రణ, కేంద్రాల నిర్వహణ, ప్రశ్నాపత్రాల రవాణా, ఇన్విజిలేటర్ల భత్యం, మూల్యాంకన వేతన చెల్లింపుల కోసం వినియోగించాలి. అంటే పరీక్షలకు సంబంధించిన ప్రక్రియలో ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు ఇవ్వాల్సిన అవసరం లేదు. విద్యార్థుల నుంచి పరీక్షల ఫీజులను వసూలు చేస్తూ.. వారు జాప్యం చేస్తే పైన్లు వేస్తున్న ప్రభుత్వం చెల్లింపుల్లో జాప్యం ఎందుకు చేస్తున్నదో అర్థం కావడం లేదని ఉపాధ్యాయ సంఘాల నాయకులు వాపోతున్నారు

### ఏటా ఇదే తంతు..

పదో తరగతి మూల్యాంకన చెల్లింపులు విషయంలో ఏటా జాప్యం జరుగుతోందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. గతేడాది పది సప్లిమెంటరీ పరీక్షల మూల్యాంకన చెల్లింపులు కూడా ఇంతవరకు పూర్తికాలేదని ఉపాధ్యాయులు వాపోతున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో గత ఏడాది జరిగిన పది మూల్యాంకనానికి (మిగతా 6వ పేజీలో)



# 2,32,859 మందికి.. సుఖీభవ

- పథకం అమలుకు సర్వం సిద్ధం
- అనర్హుల జాబిలో 5 వేల మంది రైతులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

అన్నదాత సుఖీభవ పథకం అమలుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సిద్ధమవు తున్నాయి. జిల్లాలో 2,32,859 మంది రైతులను అధికారులు అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులుగా నిర్ధారించారు. ఆగస్టు 2న రైతుల బ్యాంకు ఖాతాలకు సుఖీభవ సొమ్ము జమ చేయనున్నట్లు ప్రభు త్వం ప్రకటించింది. వివిధ కారణాలతో అనర్హుల జాబితాలో సుమారు 5 వేల మంది రైతుల పేర్లు ఉన్నాయి. వీరికి సుఖీభవ సొమ్ము అందుతుందా లేదా అన్న సందేహాలు నెలకున్నాయి. సాగు ముమ్మరంగా సాగు తున్న తరుణం లో పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకాలకు సంబంధించి రూ.7 వేలు రైతులకు పంపిణీ చేయనుండటంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది. రైతు సేవా కేంద్రాలతో పాటు అన్నదాత సుఖీభవ వెబ్‌సైట్ ద్వారా అర్హత తెలుసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. ఆధార్ నెంబర్ ఎంటర్ చేస్తే అర్హత ఉందీ లేనిదీ తెలుసుకోవచ్చు. అలాగే మన మిత్ర యాప్ ద్వారా కూడా స్టేటస్ తెలుసుకోవచ్చు.

### అధికారుల నిర్లక్ష్యంతో అనర్హులు

రీసర్వే సమస్యలను పరిష్కరించడం లో రెవెన్యూశాఖ నిర్లక్ష్యం వల్ల వేలాది మంది రైతులు సుఖీభవ పథ కాన్ని అందుకోలేక పోతున్నారు. వ్యవసాయశాఖ లెక్కల ప్రకారం జిల్లాలో 4,48,658 మంది రైతులు ఉన్నారు. వీరిలో 2,32,859 మంది రైతులు మా త్రమే అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులుగా ఉన్నారు. ఈకేవైసీ కాక పో వడం, మ్యాపింగ్ సమస్య, రెవెన్యూ రికార్డులు సక్రమంగా లేకపోవడం తదతర కారణాలతో వేలాది మంది రైతులు అనర్హులుగా మారారు. వీరిలో కొందరికైనా సుఖీభవ రావచ్చని వ్యవసా య శాఖ అధికారులు చెబుతున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో జిల్లాలో 2,48,812 మంది రైతులకు రైతు భరో సా అందింది. అప్పటికి,ఇప్పటికి 16,023 మంది లబ్ధిదారుల తగ్గినట్లు వ్యవసా యశాఖ లెక్కలు చెబుతున్నాయి. వివిధ వడపోతల అనంతరం అర్హులను నిర్ధారించారు. కౌలు రైతులను ఈ పథకానికి ఎంపిక చేయలేదు. పంటల సాగు అనంతరం ఈ క్రాప్ నమోదైన కౌలు రైతులకు సుఖీభవను అందించనున్నారు.



# టెయిల్‌పాండ్‌కు భారీగా వరద



- 14 క్రస్ట్ గేట్లు ఎత్తి 2,46,327 క్యూసెక్కుల విడుదల

రెంటచింతల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని కృష్ణానదిపై నిర్మించిన సాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టుకు భారీగా వరద నీరు వచ్చి చేరుతుంది. దీంతో డ్యాంకున్న 20 గేట్లలో 11 గేట్లను 3.5 మీటర్లు, 3 గేట్లను 2.5 మీటర్ల మేర ఎత్తి 2,38,727 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. రెండు యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తి అనంతరం టేల్ రేస్ చానల్ ద్వారా 7600 క్యూ సెక్కులను మొత్తం 2,46,327 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నారు. సోమవారం అర్ధరాత్రి 12 గంటల వరకు 1.08 ఎంయూల విద్యుత్ తయారైంది. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 6.704 టీఎంసీల నీరుండగా అది 74.95 మీటర్లకు అంటే 247.7 అడుగులకు సమానం. ప్రాజెక్టు ప్రారంభం తర్వాత తొమ్మిదేళ్లలో జూలైలో గేట్లు ఎత్తడం ఇదే ప్రథమం. తొలుత ఎస్ఈ కె.వెంకటరమణ, ఈఈ సుబ్రహ్మణ్యంలు పూజ చేసిన అనంతరం 14 గేట్లను ఎత్తారు. దీంతో నురగలు కక్కుతూ గేట్ల నుంచి జాలువారుతూ కృష్ణమ్మ దిగువుకు పరుగులు పెట్టింది. గేట్ల నుంచి జాలువారుతున్న కృష్ణమ్మ సోయగాలను తిలకించడానికి సందర్శకులకు అనుమతి ఇస్తున్నట్లు ఎస్ఈ తెలిపారు. లక్షల క్యూసెక్కుల నీరు వస్తుండడంతో మంగళవారం సాయంత్రం 5 గంటల 30 నిమిషాల నుంచి విద్యుదుత్పత్తిని పూర్తిగా నిలిపివేశారు.



# సరిహద్దులో..కిక్

- మాచర్ల ప్రాంతంలో వైన్స్ కిటకిట
- గతంతో పోలిస్తే భారీగా పెరిగిన విక్రయాలు
- జగన్ హయాంలో మందుబాబులు చలో తెలంగాణ

గుంటూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో నాసిరకం మద్యంతో ఒళ్లుగుల్ల చేసుకున్న మందుబాబులు ప్రస్తుతం పండుగ చేసుకుంటున్నారు. గతంలో కోరుకున్న బ్రాండ్లు దొరక్క.. ధరల దోపిడీ తట్టుకోలేక గుంటూరు, పల్నాడు ప్రాంతాల్లోని మందుబాబులు తెలంగాణ బాట పట్టేవారు. అక్కడ కోరుకున్న బ్రాండ్లతో పాటు తక్కువ ధరకు మద్యం అందుబాటులో ఉండటంతో సరిహద్దుల్లోని దుకాణాలు కిటకిటలాడేవి. ఇదే సమయంలో పల్నాడు జిల్లా (మిగతా 6వ పేజీలో)



వృధాగా పోతున్న గోలి వాగు నీరు

# గోలివాగు నీరు వృథా

- వినియోగంలోకి తెస్తే 2 వేల ఎకరాల ఆయకట్టు
- సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్తానన్న ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి

రెంటచింతల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): సాగునీటి కోసం రైతులు ఒకవైపు అల్లాడుతుండగా మరోవైపు గోలివాగు నుంచి పెద్దఎత్తున వృథాగా పోతుంది. గోలి వాగు నీటిని వాడుకలోకి తెస్తే 2 వేల ఎకరాలకు సాగు నీరందించవచ్చు. వరద సమయాల్లో 100 క్యూసెక్కులకు పైగా నీరు సత్రశాల సమీపంలోని కృష్ణానదిలో కలుస్తుంది. బుగ్గవాగు సీపేజ్ నీరు(లీకేజ్ నీరు) గోలి వాగు, ఏడుమంగళం, పిల్లివాగుల్లో కలుస్తుండటంతో ఏడాది పొడవునా ప్రవాహం ఉంటుంది. ఇక్కడ లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేస్తే గోలి, పశర్లపాడు, మల్లవరం, జెట్టిపాలెం గ్రామాల పరిధిలోని వ్యవసాయ భూముల్లో సిరులు పండించవచ్చు.

### 2005లో ప్రతిపాదన..

ఎత్తిపోతలపై 2005 డిసెంబరు 17న ఏపీఎస్ఐడీసీ అధికారులతో అప్పటి ఎమ్మెల్యే దివంగత పిన్నెల్లి లక్ష్మారెడ్డి చర్చించారు. తొలుత 1300 ఎకరాలకు నీరివ్వాలని భావించారు. అయితే రైతుల ఒత్తిడి మేరకు మరో 700 ఎకరాలు అంటే 2000 ఎకరాలకు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీరివ్వాలని అప్పట్లో ప్రతిపాదించారు. ఎకరాకు రూ.30 వేలు చొప్పున మొత్తం రూ.6 కోట్లు వ్యయం అవుతుందని తేల్చారు. ఇరవై ఏళ్లు దాటినా ఎత్తిపోతల పట్టాలపైకి రాలేదు. ఈ పరిస్థితుల్లో ఆయా గ్రామాల రైతులను ముఖ్యమంత్రి చంద్రబాబు వద్దకు తీసుకెళ్లి ఎత్తిపోతల సమస్యను వివరిస్తానని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తెలిపారు.



## అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ల నియామకం



తీగల దుర్గాప్రసాద్



అశోక వాణి

గుంటూరు(లీగల్), జూలై 29 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా కేంద్రంలో ఖాళీగా ఉన్న రెండు కోర్టులకు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లను నియమిస్తూ రాష్ట్ర హోం శాఖ ప్రధాన కార్యదర్శి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరు జిల్లా కోర్టులో సీనియర్ న్యాయవాదిగా పనిచేస్తున్న తీగల దుర్గాప్రసాద్‌ను పోక్సో కోర్టుకు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమించారు. ఈయన గతంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో జిల్లా ప్రధాన న్యాయస్థానంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా మూడేళ్లు పనిచేశారు. 40 సంవత్సరాలుగా గుంటూరు జిల్లా కోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్నారు. గుంటూరు ఒకటవ అదనపు జిల్లా కోర్టుకు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా గుంటూరు బార్ అసోసియేషన్‌కు చెందిన మరో మహిళా న్యాయవాది సీహెచ్ ఎస్ అశోక వాణి వేజెండ్లను నియమించారు. క్రోసూరు మండలం వేల్పూరుకు చెందిన ఈమె 2004 నుంచి జిల్లా కోర్టులలో న్యాయవాదిగా కొనసాగుతున్నారు. వీరిరువురు మూడేళ్ల పాటు ఆయా పదవుల్లో కొనసాగుతూ పోలీస్ శాఖ తరపున కోర్టులలో తమ వాదనలు వినిపించనున్నారు.

## సీఈఓతో ఎస్ఎస్‌జీ నోడల్ టీం భేటీ



జిల్లా పరిషత్ సీఈఓ జ్యోతి బసుతో భేటీ అయిన ఎస్ఎస్‌జీ నోడల్ టీం

గుంటూరు సిటీ, జూలై 29(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లాలోని 22 గ్రామ పంచాయతీల్లో తనిఖీలు చేపట్టనున్న ఎస్ఎస్‌జీ (స్వచ్ఛ సురక్ష గ్రామీన్)నోడల్ టీంతో జిల్లా పరిషత్ సీఈఓ వీర్ల జ్యోతిబసు భేటీ అయ్యారు. జిల్లా పరిషత్ లోని సీఈఓ ఛాంబర్ నందు మంగళవారం జరిగిన ఈ భేటీలో పలు అంశాలను చర్చించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ ఎస్ఎస్‌జీ నోడల్ టీం జిల్లాలో పర్యటించి పలు అంశాలను క్షుణ్ణంగా పరిశీలిస్తారని వెల్లడించారు. గ్రామం లోని పాఠశాలలు, అంగన్వాడీ, ప్రార్థనా స్థలాలు, హెల్త్ సెంటర్లు తదితర అంశాలను పరిశీలించి నివేదిక రూపొందించటం జరుగుతుందని అన్నారు.

**శిక్షణా కార్యక్రమం...**

ట్రైనింగ్ మేనేజ్ మెంట్ పోర్టల్,ప్రగతి పోర్టల్‌పై సాంకేతిక సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ పరంగా జరిగే ప్రతి శిక్షణా కార్యక్రమాల వివరాలు ఖచ్చితంగా ట్రైనింగ్ మేనేజ్ మెంట్ పోర్టల్ నందు నమోదు చేయాలని సీఈఓ జ్యోతి బసు సూచించారు. ఈ కార్యక్రమంలో రవీంద్ర, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.







# మంచి పనులు చేసినప్పుడే గుర్తింపు

**ఆళ్ల రాఘవయ్య విగ్రహావిష్కరలో సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు**

పెదనందిపాడు జూలై 29 (ఆంధ్రజ్యోతి) : మంచి పనులు చేసినప్పుడే ప్రజల్లో గుర్తింపు వస్తుందని సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు అన్నారు. మండల పరిధిలోని నాగులపాడు బొడ్డురాయి సెంటర్లో మాజీ సర్పంచ్ ఆళ్ల రాఘవయ్య విగ్రహావిష్కరణను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జస్టిస్ లావు నాగేశ్వరరావు మాట్లాడుతూ దేశంలో ఎంతో మంది పేదలు ఉన్నారని వారికి తమవంతుగా సహాయసహకారాలు అందించాలన్నారు. కుటుంబాలు సంతోషంగా ఉన్నప్పుడు సమాజం గురించి ఆలోచించాలన్నారు. అందరూ కలికట్టుగా పనిచేస్తే ఏదైనా సాధించవచ్చునని తెలిపారు. 37 సంవత్సరాలు గ్రామసర్పంచ్‌గా పనిచేసి ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన రాఘవయ్య ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. విజ్ఞాన్ విద్యాసంస్థల అధినేత లావు రత్తయ్య మాట్లాడుతూ పేదరికం లేని సమాజం కోసం రాఘవయ్య పరితపించేవారని, అందరికీ సమానహక్కులు కల్పించాలనే లక్ష్యంతో పేదల పక్షాన నిలిచారన్నారు. నల్లమడ రైతు సంఘం జిల్లా నేత కొల్లా రాజమోహనరావు మాట్లాడుతూ ఈ ప్రాంత సమస్యలను గుర్తించి వాటి సాధన కోసం ఆళ్ల రాఘవయ్య కృషిచేశారన్నారు. తాగు,సాగునీటి కోసం ఎన్నో ఉద్యమాలు చేపట్టారని ఆయన స్ఫూర్తితోనే తాము పోరాటాలు సాగిస్తున్నామన్నారు. తొలుత రమణ బృందం విప్లవగీతాలు ఆలపించారు. అన్నదాత మణి తనప్రాసతో రాఘవయ్య జీవిత చరిత్రను వివరిస్తూ గ్రామస్థులను మంత్రముగ్ధులను చేశారు. అనంతరం రాఘవయ్య కుటుంబ సభ్యులు అతిథులతో పాటు, స్థల దాత కాపు వెంకటసుబ్బారావు, రాఘవయ్య సమకాలికులు అయిన నంగినేని కోటేశ్వరరావు, తమలపాకుల రెడ్డంకుల్ లను దుశ్శాలువా, మెమొంటోలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నర్రా బాలకృష్ణ, ఆళ్ల విజయ్‌కుమార్, డాక్టర్ ఆళ్ల సుబ్బారావు, బండారు సుజాత, ఆళ్ల హరి ప్రసాద్, లోకాదిత్య, సంగం డెయిరీ డైరెక్టర్ గొల్లపూడి శ్రీనివాసరావు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు బండి నాగబాబు, కమిటీ సభ్యులు ముత్తవరపు నాగేశ్వరరావు, పాటిబండ్ల నాగరాజు, నాగబాబు, ఆళ్ల ఫణిబాబు, బండి కిరణ్‌కుమార్, సందిరెడ్డి ఉమా, భీమినేని రవి తదితరులు పాల్గొన్నారు.



ఆళ్ల రాఘవయ్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి లావు నాగేశ్వరరావు తదితరులు

# విద్యుత్ ఉద్యోగుల.. బదిలీలో ప్రతిష్టంభన

- సర్కిల్స్ పునర్విభజనలో మార్పులు, చేర్పులపై కసరత్తు
- విభజన తరువాతనే బదిలీలపై దృష్టి సారించే అవకాశం

గుంటూరు, జూలై 29(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ సంస్థలో ఉద్యోగుల బదిలీలపై ప్రతిష్టంభన కొనసాగుతోంది. ఇటీవల సంస్థలో జరిగిన సర్కిల్స్ పునర్విభజనపై అనేక ప్రాంతాల నుంచి స్వల్ప అభ్యంతరాలు రావటంతో ఆ దిశగా ఉన్నతాధికారులు కసరత్తు చేస్తున్నారు. సర్కిల్స్ పునర్విభజనలో స్వల్ప మార్పులు, చేర్పులపై దృష్టి సారించినట్లు సమాచారం. తద్వారానే ఉద్యోగుల బదిలీల ప్రక్రియ ప్రస్తుతానికి పెండింగ్‌లో పెట్టినట్లు తెలిసింది. సీపీడీసీఎల్‌లో గత నెలలో సర్కిల్స్ పునర్విభజన చేసిన విషయం తెలిసిందే. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని సీఆర్‌డీఏ, గుంటూరు, పల్నాడు, బాపట్ల సర్కిల్‌లో గత నెలలో మార్పులు, చేర్పులతో పునర్విభజన చేస్తూ సీఎండీ పీ పుల్లారెడ్డి ఆదేశాలు జారీ చేశారు. అయితే ఆయా సర్కిల్స్‌తో పాటు కృష్ణా జిల్లాలోనూ పలు సర్కిల్స్ పునర్విభజనలో స్వల్ప అభ్యంతరాలు వచ్చినట్లు సమాచారం. దాంతో సీఎండీ పుల్లారెడ్డి, టెక్నికల్ డైరక్టర్ ఆవుల మురళీకృష్ణయాదవ్‌లు సర్కిల్స్ పునర్విభజనపై కసరత్తు చేస్తున్నారు. ముఖ్యంగా పల్నాడు సర్కిల్స్ విభజనపై అభ్యంతరాలు వచ్చినట్లు తెలిసింది. ఇటీవల కొత్తగా ఏర్పాటు చేసిన చిలకలూరిపేట డివిజన్‌లో సత్తెనపల్లి టౌన్, రూరల్ సబ్ డివిజన్‌లు ఏర్పాటు చేయటంపై కూడా అభ్యంతరాలు వచ్చాయని చెబుతున్నారు. పాత పద్ధతిలోనే సత్తెనపల్లి టౌన్, రూరల్ సబ్ డివిజన్ ప్రాంతాలను నరసరావుపేట డివిజన్‌లో కలిపితే వినియోగదారులకు అందుబాటులో ఉంటుందని పేర్కొంటున్నారు. అలానే 17 సెక్షన్‌లతో సంస్థలోనే పెద్ద డివిజన్‌గా ఉన్న నరసరావుపేటలో పరిసర ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉండేలా విలీనం జరగాలని కోరుతున్నారు. అలానే ఈపూరు, బొల్లాపల్లి , రేమిడిచర్లను ఒక సబ్ డివిజన్‌గా చేసి బొల్లాపల్లిలో ఒక సబ్ డివిజన్ ఏర్పాటు చేస్తే వినియోగదారులకు మరింత ప్రయోజనకరంగా ఉంటుందని స్థానిక రైతులు కోరుతున్నారు. ఇందులో వ్యవసాయ కనెక్షన్‌లు పెద్దఎత్తున ఉన్నాయని గుర్తుచేస్తున్నారు. శావల్యాపురం, నూజెండ్ల, వినుకొండ టౌన్, రూరల్ ప్రాంతాలను చిలకలూరిపేట డివిజన్‌లో కలిపితే ఆయా ప్రాంత వినియోగదారులకు రాకపోకలకు కూడా అనుకూలంగా ఉంటుందని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

**త్వరలోనే ఉద్యోగుల విభజన**

సర్కిల్స్ పునర్విభజనలో స్వల్ప మార్పులు, చేర్పులు కూడా తుది దశకు చేరినట్లు అధికార వర్గాలు తెలిపాయి. పునర్విభజన అనంతరం కొత్త సర్కిల్స్, డివిజన్ కార్యాలయాలకు ఉద్యోగుల విభజన ప్రక్రియ ప్రారంభించనున్నారు. ఇప్పటికే ఉద్యోగుల బదిలీలపై ఆప్షన్స్ ప్రక్రియ చేపట్టిన అధికారులు ప్రస్తుతానికి పెండింగ్‌లో పెట్టారు. ఆగస్టు మొదటి, రెండు వారాల్లోనే ఉద్యోగుల విభజన ప్రక్రియ కూడా దాదాపు పూర్తి చేయనున్నట్లు సమాచారం.

# సరిహద్దులో..కిక్

(5వ పేజీ తరువాయి)

పరిధిలోని సరిహద్దు గ్రామాల్లోని ప్రభుత్వ మద్యం దుకాణాల్లో అమ్మకాలు లేక వెలవెలపోయేవి. ఈ పరిస్థితుల్లో ముఖ్యమంత్రిగా చంద్రబాబు అధికారం చేపట్టిన వెంటనే ప్రభుత్వ దుకాణాలను తొలగించి గతంలో మాదిరిగా ప్రైవేటు పరం చేశారు. అంతేకాకుండా జే బ్రాండ్లకు తిలోదకం పలికి అన్ని రకాల బ్రాండ్ల మద్యాన్ని అందుబాటులోకి తెచ్చారు. పైగా వైసీపీ హయాంలో కంటే మద్యం ధరలను తగ్గించారు. ఈ క్రమంలో 2024 అక్టోబరు 16న ప్రైవేటు దుకాణాలు తిరిగి తెరుచుకున్న రోజున మందుబాబులు పండుగగా భావించి వైన్స్ ఎదుటబారులు తీరారు. వైసీపీ హయాంలో కంటే ప్రస్తుతం గుంటూరు, పల్నాడు జిల్లాల్లో మద్యం అమ్మకాలు 20 శాతానికి పైగా పెరిగాయి. తెలంగాణ సరిహద్దులోని మాచర్ల, గురజాల, పిడుగురాళ్ల ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలోని మద్యం దుకాణాల్లో అమ్మకాలు గతంతో పోల్చితే భారీగా పెరిగాయి. తెలంగాణకు సమీపంలో ఉన్న మాచర్లలో ప్రస్తుతం భారీగా అమ్మకాలు జరుగుతున్నాయి. అప్పట్లో ప్రజాప్రతినిధి కనుసన్నల్లో ఆయన అనుచరులు పక్క రాష్ట్రం నుంచి మందుబాబులు కోరుకునే మద్యాన్ని తెప్పించి అనధికార అమ్మకాలు చేపట్టడం కూడా విక్రయాలు తగ్గడానికి మరో కారణం.

**అమ్మకాలు నాడు ఘోరం.. నేడు భారీగా**

మాచర్ల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వైసీపీ హయాంలో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో అమ్మకాలు ఘోరంగా పడిపోయాయి. 2023 నవంబరు నుంచి 2024 జూన్ వరకు ఆ ప్రాంతంలో బ్రాందీ, విస్కీ వంటివి 51 వేల 644 కేసులు, బీరు 45 వేల 538 కేసులు అమ్ముడయ్యాయి. తద్వారా రూ.44.17 కోట్ల ఆదాయం వచ్చింది. చంద్రబాబు హయాంలో 2024 నవంబరు నుంచి 2025 జూన్ వరకు మాచర్ల ప్రాంతంలో బ్రాందీ, విస్కీ వంటివి 92 వేల 964 కేసులు, బీరు 45 వేల 558 కేసుల అమ్మకాలు జరిగాయి. తద్వారా రాబడి రూ.69.58 కోట్లు వచ్చింది. ఈ ప్రకారం లిక్కర్ అమ్మకాలు 80 శాతం, బీరు అమ్మకాలు 359 శాతం పెరిగాయి. రాబడి 58 శాతం పెరిగింది. గురజాల ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలో ఇదే సమయంలో వైసీపీ హయాంలో లిక్కర్ 72 వేల 719 కేసులు, బీరు 13 వేల 399 కేసులు అమ్మారు. రాబడి రూ.61.90 కోట్లు వచ్చాయి. ప్రస్తుతం లిక్కర్ 88 వేల 112 కేసులు, బీరు 33 వేల 207 కేసుల అమ్మకాలు జరిగాయి. తద్వారా రూ.64.92 కోట్లు రాబడి వచ్చింది. ఈ స్టేషన్ పరిధిలో వైసీపీ హయాం కంటే లిక్కర్ 21 శాతం, బీరు అమ్మకాలు 148 శాతం పెరగ్గా రాబడి ఐదు శాతం పెరిగింది. పిడుగురాళ్ల పరిధిలో ఇదే సమయంలో వైసీపీ హయాంలో లిక్కర్ 99 వేల 149 కేసులు, బీరు 20వేల 408 కేసులు అమ్మారు. తద్వారా రాబడి రూ.82.33 కోట్లు వచ్చింది. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో ఇదే సమయంలో లిక్కర్ 1 లక్షా 19 వేల 291 కేసులు, బీరు 55వేల 283 కేసుల అమ్మకాలు జరిగాయి. తద్వారా రూ.89.09 కోట్లు రాబడి వచ్చింది. ఈ లెక్కల ప్రకారం వైసీపీ హయాంలో నాసిరకం మందును తక్కువ సంఖ్యలో అమ్మినా రాబడి భారీగానే వచ్చింది. చంద్రబాబు హయాంలో మంచి రకం మద్యం అందుబాటులోకి తెచ్చి అమ్మకాలు భారీగా పెరిగినా ఆదాయం మాత్రం అందుకు అనుగుణంగా పెరగకపోవడానికి కారణం అప్పట్లో మందుబాబులను దోచుకోకపోవటమేనని తెలుస్తోంది.

## మూల్యాంకన వేతనం.. మరిచారు

(5వ పేజీ తరువాయి)

సబ్జెక్టుల వారీగా దాదాపు 5 వేల మంది ఉపాధ్యాయులు, వివిధ కేటగిరీలకు సంబంధించి మరో 400 మంది హాజరయ్యారు. దాదాపు పది రోజులపాటు వారు మూల్యాంకన విధుల్లో పాల్గొన్నారు. విధుల్లో పాల్గొనేందుకు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి డీఏ కూడా చెల్లించాలి. ఇదిలా ఉంటే దూరవిద్య పరీక్షలకు సంబంధించిన మూల్యాంకన విధుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులకు కూడా ఇంతవరకు చెల్లింపులు జరగలేదు. మూల్యాంకన కేంద్రాల్లో టెంట్లు, రవాణా, ఇతర ఖర్చుల కోసం కొంతమంది ఉపాధ్యాయులు సొంతంగా ఖర్చు చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మూల్యాంకన నిధులు విడుదల చేయాలని ఉపాధ్యాయులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## రాజధాని రైతులకు కౌలు జమ

- రాజధాని రైతులకు శఠగోపం కథనాన్ని తప్పుపట్టిన సీఆర్డీఏ కమిషనర్
- ఇప్పటివరకు రూ. 164.21 కోట్ల నగదు జమ
- ఇంకా రూ.61.34 కోట్ల మాత్రమే చెల్లించాలి
- సాంకేతిక కారణాలతోనే జాప్యం
- సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు

విజయవాడ, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రాజధాని రైతులకు 2024-25 ఏడాదికి సంబంధించి చెల్లించాల్సిన వార్షిక కౌలు డబ్బులను వారి బ్యాంక్ ఖాతాల్లో జమచేసినట్టు సీఆర్డీఏ కమిషనర్ కే కన్నబాబు తెలిపారు. మంగళవారం మీడియాకు విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలుపుతూ, 'రాజధాని రైతులకు శఠగోపం' అనే శీర్షికతో ఓ పత్రికలో వచ్చిన కథనం అవాస్తమన్నారు. వాస్తవానికి రైతులకు మొత్తం రూ.225.55 కోట్లను కౌలు చెల్లించాల్సి ఉండగా, ఇప్పటివరకు రూ.164.21 కోట్లను రైతుల బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం జమచేసినట్టు తెలిపారు. ఇంకా రూ.61.34 కోట్లు మాత్రమే చెల్లించాల్సి ఉందన్నారు. రైతుల బ్యాంక్ ఖాతాల లింకేజీ ప్రక్రియలో వచ్చిన సాంకేతిక కారణాలు, కొంతమంది రైతులు తమ ప్లాట్లను అమ్మడం, అలాగే మరణించిన రైతుల కుటుంబసభ్యుల వివరాలు అందకపోవడంతో నిధులు జమకాలేదని కమిషనర్ తెలిపారు. గత శుక్రవారం నిర్వహించిన గ్రీవెన్స్ డేలో అందజేసిన ఫిర్యాదులను పరిష్కరించి కౌలు రైతులకు నగదును త్వరలో జమ చేయడం జరుగుతుందన్నారు. అయితే అర్హత ఉన్న రైతులకు సైతం కౌలు జమకాలేదని మాజీ సీఎం జగన్‌కు సంబంధించిన ఓ వార్తాపత్రిక తప్పుడు కథనాన్ని ప్రచురించిందని, ఆ వార్త పూర్తిగా అవాస్తవమని అధికారులు లెక్కలతో సహా వివరించారు.

**పాల ఉత్పత్తిదారుల సంక్షేమమే లక్ష్యంగా**

## డీవీసీ అభయ బీమా

**సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల**



బీమా పరిహార నగదు అందజేస్తున్న చైర్మన్ నరేంద్రకుమార్

పొన్నూరు టౌన్(చేబ్రోలు), జూలై 29 (ఆంధ్రజ్యోతి) : సంగం డెయిరీ అభివృద్ధిలో భాగస్వాములైన పాల ఉత్పత్తిదారుల సంక్షేమమే లక్ష్యంగా డీవీసీ అభయ బీమా పథకాలను అమలు చేస్తున్నట్లు సంగం డెయిరీ చైర్మన్, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ అన్నారు. వడ్లమూడి సంగం డెయిరీలో మంగళవారం డీవీసీ అభయ పథకం క్రింద మంజూరైన పరిహార నగదును లబ్ధిదారుల కుటుంబాలకు చైర్మన్ నరేంద్రకుమార్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాల ఉత్పత్తిదారులకు మెరుగైన పాలధర బోనస్ అందిస్తున్నట్లు తెలిపారు. అనేక రకాల సబ్సిడీలతో పాటు పశువైద్య సదుపాయాన్ని కల్పించామన్నారు. పాల ఉత్పత్తిదారుడు అకాల మరణం చెందితే వారి కుటుంబానికి అండగా సంగం డెయిరీ నిలవాలనే లక్ష్యంతో డీవీసీ అభయ పథకాన్ని రూపొందించి అమలు చేస్తున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా జడవల్లి గ్రామ పాల రైతు పిల్లి శారమ్మ కుటుంబ సభ్యులకు రు.1,29,144లు, మరో రు.10వేలు అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం అందజేశారు. నిడుబ్రోలుకు చెందిన పొన్నగంటి సుబ్బారావు, నన్నపనేని వెంకటేశ్వరరావులకు రు.60వేలు, కర్లపాలెం మండలం బుద్దాం గ్రామ రైతు నర్రా రామయ్యకు రు.60వేలు, ఆకుల వాసుబాబుకు చెందిన పశువు మృతిచెందిన కారణంగా రు.50వేలు అందించారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు వలివేటి ధర్మారావు, మరీదు వెంకటేశ్వరరావు, రీజనల్ మేనేజర్ పాతూరి ఆదినారాయణ, లబ్ధిదారులు, సంగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు సింగపూర్ పర్యటనపై వైసీపీ దుష్ప్రచారం

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు సింగపూర్ పర్యటనపై దుష్ప్రచారం చేసే స్థితికి జగన్ దిగజారాడని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సింగపూర్ పర్యటనపై తన అవినీతి మీడియాలో, వైసీపీవారితో బురద జల్లిస్తున్నాడని విమర్శించారు. చంద్రబాబు కృషి ఫలించి, సింగపూర్ పర్యటన ఫలప్రదమై రాష్ట్రానికి పెట్టుబడులు వస్తే ప్రజలు తన కుట్ర రాజకీయాలను నమ్మరన్న దుర్బుద్ధితోనే జగన్ దుష్ప్రచారానికి తెగబడ్డాడని వివరించారు. సింగపూర్ ప్రభుత్వం, ఆ దేశ పారిశ్రామికవేత్తలు, వ్యాపారదిగ్గజాలు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు వెల్లడించే అంశాలు, రాష్ట్రంలోని అవకాశాలు, వనరుల వినియోగంపై సానుకూలత వ్యక్తం చేస్తూండటం రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి శుభసూచకమైతే, జగన్ కు, వైసీపీకి మాత్రం మింగుడుపడని అంశంగా ఉందని పేర్కొన్నారు.

**జిల్లాస్థాయిలో ఉత్తమ పీఎంశ్రీ హైస్కూల్‌గా**

## 75 తాళ్లూరు జడ్పీ పాఠశాల



ఉత్తమ పీఎంశ్రీ హైస్కూల్‌గా శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న డీఈవో చంద్రకళ

పెదకూరపాడు, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లాస్థాయిలో ఉత్తమ పీఎంశ్రీ హైస్కూల్‌గా 75 తాళ్లూరు జడ్పీ హైస్కూల్ ఎంపికైందని జిల్లా విద్యా శాఖాధికారి ఎల్ చంద్రకళ అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం జాతీయ విద్యా విధానం ఎన్ఈపీ 2020.. 5వ వార్షికోత్సవం సందర్భంగా న్యూఢిల్లీలో కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ జాతికి అంకితం చేశారన్నారు. దేశ వ్యాప్తంగా ఎంపిక చేసిన పాఠశాలల్లో 75 తాళ్లూరు జడ్పీ హైస్కూల్ ఉండటం తమ ఊరికే గర్వకారణమన్నారు. కార్యక్రమంలో ఏపీసీ ఆర్ రమేష్, ఏఎంవో పూర్ణచంద్రరరావు, ఎంఈవో పీ సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయులు అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి, శివ, ఏఈ అనుముల శ్రీనివాసరెడ్డి, బీ చంద్రకుమారి తదితరులు పాల్గొన్నారు. న్యూఢిల్లీ నుంచి ప్రసారమైన వివిధ కార్యక్రమాలను విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తిలకించారు.

## అనుమతులు లేకుండా కొండరాళ్ల తరలింపు

● అడ్డుకున్న మైనింగ్ అధికారులు ● రూ.16వేలు అపరాధ రుసుం విధింపు



మైనింగ్ అధికారులు సీజ్ చేసిన టిప్పర్‌లు

యడ్లపాడు, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : మైనింగ్‌శాఖ అనుమతులు లేకుండా కొండరాళ్ళను స్టోన్ క్రషర్‌లకు రవాణా చేస్తున్న టిప్పర్‌లను మైనింగ్ అధికారులు మంగళవారం అడ్డుకున్నారు. మైనింగ్‌శాఖ ఏడీ నాగిని తెలిపిన వివరాల ప్రకారం.. యడ్లపాడు మండలం వంకాయలపాడు పరిధిలోని గృహలక్ష్మి, ప్రజ్ఞ స్టోన్ క్రషర్ల నిర్వాహకులు ఎటువంటి అనుమతులు లేకుండా క్వారీయింగ్ నిర్వహిస్తున్నారు. వంకాయలపాడు పరిధిలో రెండు దశాబ్దాల క్రితం మూతపడిన కొండ క్వారీలోను, విశ్వనాధుని కండ్రిక అగ్రహారం పరిధిలోగల ఎర్రకొండలో అనుమతులు తీసుకోకుండా క్వారీయింగ్ జరిపి కొండరాళ్ళను క్రషర్‌లకు తరలించుకుంటున్నారు. అక్రమంగా కొండరాళ్ళను తరలిస్తున్న టిప్పర్‌లను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించామన్నారు. ఒక్కొక్క టిప్పర్‌కు రూ.8వేలు చొప్పున రెండింటికి రూ.16వేలు జరిమానా విధించినట్లు ఈ సందర్భంగా ఏడీ తెలిపారు.

## పచ్చదనం పెంపొందించాలి

**విద్యార్థులకు దండా లక్ష్మీనారాయణ సూచన**



విత్తన బంతులను తయారు చేస్తున్న విద్యార్థులు

నాదెండ్ల, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : పచ్చదనాన్ని పెంపొందించేందుకు విత్తన బంతులను తయారు చేయటంలో విద్యార్థులు భాగస్వామ్యం కావాలని ప్రోగ్రాం కన్వీనర్ దండా లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని గణపవరం గ్రామంలో గల కెల్లంపల్లి భద్రచలం ఉన్నత పాఠశాలలో వేప, గానుగ తదితర విత్తనాలను బంతులుగా తయారు చేసే కార్యక్రమాన్ని చిలకలూరిపేట రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ఉప్పుటూరి ప్రసాదు మాట్లాడుతూ వర్షా కాలంలో విత్తన బంతులను విసరటం ద్వారా మొక్కలు మొలచి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడతాయన్నారు. ప్రధానోపాధ్యాయుడు ఐ కృష్ణా నాయక్ మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులు సుమారు నాలుగు వేల విత్తన బంతులను తయారు చేసి చల్లే విధంగా లక్ష్యాన్ని పెట్టుకున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి బోడి రామ సుబ్బారావు, ఉప్పుటూరి భరత్ పాల్గొన్నారు.

**నెక్ సూచించిన కోడిగుడ్ల ధర**

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.75 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

**బ్రాయిలర్ ధరలు**

**అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్**

| | |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ (కిలో) | 116, 124, 135 |
| చికెన్ విత్ స్కిన్(కిలో) | 220.00 |
| చికెన్ స్కిన్ లెస్(కిలో) | 230.00 |

## 51,233 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 52,870 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 51,233 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 8,308 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

| వెరైటీ | కనిష్ఠధర | గరిష్ఠధర |
|---|---|---|
| **నాన్ ఏసీ కామన్ వెరైటీ** | | |
| 334 | 9500 | 13200 |
| నెంబరు. 5 | 10000 | 13300 |
| 273 | 10000 | 12800 |
| 341 | 10000 | 13500 |
| 4884 | ---- | ---- |
| సూపర్ 10 | ---- | ---- |
| **నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ** | | |
| తేజ | 10000 | 14000 |
| షార్క్-1 | ----- | ---- |
| బ్యాడిగి | 10000 | 12800 |
| దేవనూరు డీలక్స్ | 10000 | 12400 |

| వెరైటీ | కనిష్ఠధర | గరిష్ఠధర |
|---|---|---|
| ఆర్మూరు | 9600 | 11000 |
| **ఏసీ కామన్ వెరైటీ** | | |
| 334 | 9500 | 12600 |
| నెంబరు. 5 | 10000 | 13400 |
| 273 | 10500 | 12800 |
| 341 | 10000 | 13600 |
| 4884 | 10000 | 12700 |
| **ఏసీ స్పెషల్ వెరైటీ** | | |
| తేజ | 10000 | 13800 |
| బ్యాడిగి | 10000 | 12400 |
| దేవనూరు డీలక్స్ | 10000 | 12600 |
| తాలుకాయలు | 4500 | 7000 |

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మాచర్ల రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మాచర్ల పట్టణంలోని సుద్దగుంతల, ఎన్ఎస్‌డ్యాం, మండలంలోని తాళ్లపల్లి, ద్వారకాపురి సబ్‌స్టేషన్ల పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈఈ రామయ్య తెలిపారు. ఫీడర్స్ ఓరియంటేషన్ పనులు జరుగుతున్నందున విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిస్తున్నట్లు చెప్పారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

## ట్రెయినీ ఎస్ఐగా అబ్రహం

మాచవరం, జూలై 29(ఆంధ్రజ్యోతి): మాచవరం ట్రెయినీ ఎస్ఐగా గడ్డం అబ్రహం మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ తిరుపతిరావు స్టేషన్‌కు సంబంధించిన విషయాలను మండలంలోని గ్రామాల గురించి అబ్రహంకు వివరించారు.

## నేడు మండల సర్వసభ్య సమావేశం

రాజుపాలెం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జీవీ సత్యనారాయణ తెలిపారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సర్వసభ్య సమావేశం నేటి ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ సమావేశానికి మండల అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామ పంచాయతీ కార్యదర్శులు హాజరుకావాలని కోరారు.

## నేడు నెమలిపురిలో సుపరిపాలన-తొలిఅడుగు

రాజుపాలెం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెమలిపురి గ్రామంలో నేడు సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించనున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు అంచుల నరసింహారావు తెలిపారు. మంగళవారం రాజుపాలెంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నరసింహారావు మాట్లాడుతూ నెమలిపురి గ్రామంలో నేటి సాయంత్రం 4గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పాల్గొని ఇంటింటికి తిరిగి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి గురించి వివరిస్తారన్నారు. కార్యక్రమంలో మండలంలోని కూటమి నేతలందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

## అష్టలక్ష్మీదేవిగా అమ్మవారు



పిడుగురాళ్ల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మంగళవారాన్ని పురస్కరించుకొని స్థానిక కనక దుర్గ అమ్మవారిని అష్టలక్ష్మీ దేవిగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దేవాలయ కమిటీ సభ్యులు, మహిళలు కుంకుమపూజ నిర్వహించి భక్తులకు ప్రసాదం అందజేశారు.

## మోడల్ పాఠశాలను సందర్శించిన డీఈవో చంద్రకళ

అమరావతి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): అమరావతి మండలంలోని లింగాపురం మోడల్ ప్రాథమిక పాఠశాలను, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి చంద్రకళ సందర్శించారు. ప్రతిరోజు విద్యార్థులు క్రమం తప్పకుండా హాజరుకావాలని, ఏ రోజు పాఠాలు ఆ రోజే పూర్తి చేయాలన్నారు. పాఠశాలలో విద్యా ప్రమాణాలను పరిశీలించి పెరుగుదలకు కృషి చేయాలని ఉపాధ్యాయులను కోరారు.

## శ్రీపాతపాటేశ్వరి అమ్మవారి ఆలయంలో చోరీ

గురజాలటౌన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీపాతపాటేశ్వరి అమ్మవారి దేవస్థానంలో సోమవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు అమ్మవారి ఆలయంలో చొరపడి రెండు హుండీలను పగులకొట్టి నగదును దోచుకొని పరారయ్యారు. మంగళవారం తెల్లవారుజామున పూజాధికాలు నిర్వహించేందుకు వచ్చిన పూజారి ఆలయ తలుపులు, హుండీలు పగులకొట్టి ఉండడాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న సీఐ భాస్కర్ అమ్మవారి దేవస్థానానికి చేరుకొని పరిశీలించారు. క్లూస్‌టీం పరిసరాలను పరిశీలించి వివరాలను నమోదు చేసుకున్నారు. సుమారు రూ.70 వేలు దాకా హుండీల్లో నగదు ఉండవచ్చని ఈవో పూర్ణచంద్రరావు తెలిపారు. సీఐ భాస్కర్ ఆధ్వర్యాన సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు.

## యాచకుడి మృతిపై కేసు నమోదు

క్రోసూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : క్రోసూరులో పప్పం శ్రీను(35) అనే యాచకుడు మంగళవారం మృతి చెందాడు. అమరావతి బస్టాండ్ సెంటర్లోని బస్‌షెల్టర్‌లో మృతి చెందిన శ్రీను మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోలీసులు శవ పంచనామా నిర్వహించారు. శ్రీను 75తాళ్ళూరుకు చెందినవాడని, రెండు సంవత్సరాలుగా క్రోసూరులో యాచక వృత్తి చేస్తూ జీవిస్తున్నాడని పోలీసులు తెలిపారు. పంచనామా అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు. క్రోసూరు ఎస్ఐ రవిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## డ్రైవర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలి

సత్తెనపల్లి, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : ఏపీఎస్ ఆర్టీసీ సత్తెనపల్లి డిపోలో ఆన్ కాల్ డ్రైవర్‌గా పని చేసేందుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని డిపో మేనేజర్ విజయకుమార్ మంగళవారం విలేకరులకు తెలిపారు. హెవీ లైసెన్స్ కలిగి రెండు సంవత్సరాలు అనుభవం ఉండి చదవటం, రాయటం తెలిసి ఉండాలన్నారు. లైసెన్స్ ఫోర్సులో ఉండాలన్నారు. సంస్థ నిబంధన ప్రకారం ప్రతి రోజు రూ.800 జీతం ఇవ్వబడుతందన్నారు. అర్హులైన వారు డిపో మేనేజర్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 99592254299 నెంబరులో సంప్రదించాలన్నారు.

# తొలిఅడుగులో మాచర్ల టాప్ - 5

● రాష్ట్రస్థాయిలో నిలిపిన శ్రేణులకు అభినందనలు
● ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి



సుపరిపాలన తొలి అడుగులో ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి (ఫైల్‌ఫొటో)

మాచర్లటౌన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పిలుపు మేరకు జూలై 2వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ మొదలుపెట్టిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహణలో మాచర్ల నియోజకవర్గం స్టేట్ ర్యాంకును కైవసం చేసుకుంది. 175 నియోజకవర్గాలో అధిష్టానం నిర్వహించిన సర్వేలో ఇంటింటికి టీడీపీని తీసుకెళ్లడంలోను, కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న అభివృద్ధి పనులను ప్రజలకు వివరించడంలోను, ప్రజాసమస్యల పరిష్కారంలోనూ ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి, శ్రేణులు ముందున్నట్లు నివేదికలు తెలిపాయి. దీంతో పార్టీ అధిష్టానం నియోజకవర్గంను స్టేట్ టాప్-5 ర్యాంకును కేటాయిస్తూ ప్రశంసించింది.

### నూతన ఉత్సాహానిచ్చింది

సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహణలో రాష్ట్రస్థాయిలో నియోజకవర్గం టాప్-5 ర్యాంకులో నిలవడం ఎంతో గర్వకారణంగా ఉందని బ్రహ్మానందరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా 27 రోజులుగా నిర్వహిస్తున్న సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం ఎంతో విజయవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. నియోజకవర్గపరిధిలో ఉన్న దాదాపు 1.82 లక్షల గృహాలకు మంగళవారంతో 97 వేల గృహాలకు నేరుగా చేరుకొని ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని తెలియజెప్పామన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు టీడీపీ శ్రేణులు వారధిగా నిలిచి మై టీడీపీ యాప్‌ను సమర్థవంతంగా సద్వినియోగపరుచుకున్నారని ఆయన తెలిపారు. టీడీపీ క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జిలకు, పార్టీ నేతలు, కార్యకర్తలను ఎమ్మెల్యే జూలకంటి అభినందించారు.

### వరికపూడిశెల ప్రాజెక్ట్ కల నెరవేరింది

వరికపూడిశెల ప్రాజెక్టు అనేది కేవలం నీటి పారుదల పథకం కాదని, ఇది పల్నాడు, ప్రకాశం జిల్లాల ప్రజల ఆకాంక్షలకు, ఆశలకు ప్రతీక అని ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ వరికపూడిశెల ప్రాజెక్ట్ పల్నాడు ప్రాంత నీటి అవసరాలను తీర్చే వరం అన్నారు. ఏడు దశాబ్దాల సుదీర్ఘ ప్రయాణం తరువాత నీటిపారుదల రంగంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచిన ఈ ప్రాజెక్ట్ నిర్మాణానికి మార్గం సుగమమైందన్నారు. అనేక అడ్డంకులను అధిగమించి ఈ ప్రాజెక్ట్ కోసం కీలకమైన అటవీశాఖ క్లియరెన్స్ కోసం అవసరమైన రూ.14.81 కోట్ల నగదును ప్రభుత్వం అటవీ శాఖ ఖాతాలో జమ చేసిందన్నారు. ఈ స్వప్నాన్ని సాకారం చేయడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్ చేసిన అవిశ్రాంత కృషికి రుణపడి ఉంటామని ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి అన్నారు.

## రాష్ట్ర ప్రజలకు ఏ కష్టం రాకుండా శ్రమిస్తున్న సీఎం

● ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



దివ్యాంగురాలి యోగ క్షేమాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలకు ఎటువంటి కష్టం రాకుండా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అహర్నిశలు శ్రమిస్తున్నారని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని ధూళిపాళ్లలో మంగళవారం రాత్రి జరిగిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రజలతో నేరుగా మాట్లాడారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా? అని ఆరా తీశారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా? లేదా? అనే అంశంపై అధికారులు దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులను పలకరించి పాఠశాలలో బోధన ఎలా ఉంది?, తల్లికి వందనం డబ్బులు అందాయా? అని ఆరా తీశారు. దివ్యాంగురాలిని, వృద్ధుడిని ఆప్యాయంగా పలుకరించారు. కార్యక్రమంలో బద్దుల కేదార్‌నాథ్, ఆలోకం పూర్ణయ్య, బండారు ప్రసాదరావు, బత్తుల వెంకటస్వామి, చిలక కృష్ణ, బద్దుల హనుమంతరావు, బండారుపల్లి వెంకటప్పయ్య, మక్కపాటి రామచంద్రరావు, కోమటినేని శ్రీనివాసరావు, పసుపులేటి శివ మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కూటమి పాలనలో రాష్ట్రాభివృద్ధి

● టీడీపీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు ధారునాయక్



ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న ధారునాయక్

విజయపురిసౌత్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రం శరవేగంగా అభివృద్ధి చెందుతోందని టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు ధారునాయక్ అన్నారు. సుపరిపాలన-తొలిఅడుగులో భాగంగా ఇంటింటికి టీడీపీ కార్యక్రమాన్ని మంగళవారం మండలంలోని ద్వారకాపురిలో ఘనంగా నిర్వహించారు. కూటమి ప్రభుత్వ అమలు చేస్తున్న తల్లికి వందనం, ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, దీపం పథకం, యువతకు ఉద్యోగాలు, రైతు సంక్షేమ పథకాలను ప్రజలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వీరాస్వామి యాదవ్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు గుణదలానాయక్, వెంకటేశ్వర్లునాయక్, ప్రశాంత్ రామయ్య తదితరులు పాల్గొన్నారు.

## సీపీఐతోనే ప్రజా సంక్షేమం

● రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు



మహాసభలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

మాచర్ల రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టేందుకు కార్మికులంతా ఏకం కావాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. పట్టణంలోని సీపీఐ కొమెర వీరాస్వామి భవన్‌లో మంగళవారం జరిగిన మాచర్ల ఏరియా 16వ మహాసభలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రధాని మోదీ పాలనలో బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కరువైందన్నారు. కార్పోరేట్ శక్తులకు దోచి పెట్టేందుకు మోదీ ప్రజలపై లక్షల కోట్లు పన్నుల రూపేణా భారం మోపుతున్నారన్నారు. మోదీ చేతిలో సీఎం చంద్రబాబు, మాజీ సీఎం జగన్ కీలుబొమ్మలుగా మారారన్నారు. అనాదిగా వెనుకబడిన పల్నాడు ప్రాంతంపై సీఎం చంద్రబాబు దృష్టి సారించాలన్నారు. పార్టీని గ్రామస్థాయిలో బలోపేతం చేసేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించామన్నారు. సీపీఐ నేతలు ప్రజా సమస్యలపై స్పందించాలన్నారు. వందలాది మంది కార్మికులతో రైల్వే గేటు నుంచి సీపీఐ కార్యాలయం వరకు ర్యాలీ జరిపారు. సీపీఐ జెండాను ఆవిష్కరించారు. సమావేశంలో గుంటూరు, పల్నాడు జిల్లాల కార్యదర్శులు జంగాల అజయ్‌కుమార్, మారుతి వరప్రసాద్, కాసా రాంబాబు, హుస్సేన్, మేక పోతుల శ్రీనివాస రెడ్డి, రాము, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

## పంటల బీమాలో నమోదుచేసుకోవాలి

● రేపటితో ముగియనున్న గడువు : ఏవో సంధ్యారాణి

పిడుగురాళ్ల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన, వాతావరణ పంటల బీమాలో నమోదయ్యేందుకు మరొక రోజు మాత్రమే గడువు ఉందని వ్యవసాయాధికారి సంధ్యారాణి తెలిపారు. మంగళవారం గుత్తికొండలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులతో సమావేశం నిర్వహించారు. ప్రత్తి, కంది, మిరప పంటకు రేపటితో పంటల బీమా గడువు ముగుస్తుందని, వరి పంటకు మాత్రమే ఆగస్టు 15 వరకు గడువు ఉందన్నారు. రైతులు తమ దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా నమోదు చేయించుకోవచ్చునని తెలిపారు. రాయితీపై డ్రోన్ల కోసం రైతులు, రైతు గ్రూపులను బ్యాంకు అధికారులతో కలిసి జాయింట్ ఇన్‌స్పెక్షన్ చేశారు. మార్కెట్ యార్డులో డ్రోన్ పనితీరును రైతులకు, వ్యవసాయశాఖ సిబ్బందికి వివరించారు. కార్యక్రమంలో వీఏఏలు రాజశేఖర్, అహ్మద్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

● మాచవరం, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : రైతులు వివిధ రకాల పంటల బీమా పథకానికి నగదు చెల్లించు కోవాలని ఏవో రామమ్మ సూచించారు. మంగళవారం పిల్లుట్ల, సింగరాయపాలెం తండా గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు.

● రెంటచింతల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రైతులు తమ పంటలకు బీమా చేయించుకోవాలని ఏవో కట్టా లక్ష్మారెడ్డి కోరారు. మిట్టగుడిపాడు, గోలి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పీఎం ఫసల్ బీమా యోజనపై అవగాహన కల్పించారు.

● దుర్గి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): దుర్గిలో మంగళవారం ఎంపీపీ యేచూరి సునీతాసాయిశంకర్ ఆధ్వర్యాన పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు 100శాతం సబ్సిడీపై కంది విత్తనాలను పంపిణీ చేశారు.

● నకరికల్లు, (ఆంధ్రజ్యోతి): ఈ నెలాఖరులోగా పంటల బీమా చేయించుకోవాలని ఏవో దేవదాసు రైతులను కోరారు. నరసింగపాడు, త్రిపురాపురంలో పొలం పిలుస్తుంది నిర్వహించారు.

● పెదకూరపాడు, (ఆంధ్రజ్యోతి) : పత్తి, మిర్చి, కంది, వరి పండించే రైతులు పంటల బీమా నమోదు చేసుకోవాలని ఏవో కృష్ణయ్య అన్నారు. మండలంలోని హుస్సేన్ నగరం, గారపాడు గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు.

## ఆట్యా పాట్యా జిల్లా జట్టుకు జడ్పీ హైస్కూల్ విద్యార్థుల ఎంపిక



ఆట్యా పాట్యాకు ఎంపికైన నకరికల్లు జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు

నకరికల్లు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): నకరికల్లు వంగా వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 11 మంది బాల బాలికలు ఎంపికైనట్లు హెచ్ఎం జాలాది శ్రీనివాసరావు తెలిపారు. ఆగస్టు 9, 10 తేదీల్లో ఒంగోలులో జరిగే రాష్ట్రస్థాయి ఆట్యా పాట్యా జూనియర్ చాంపియన్ షిప్ పోటీల్లో ఈ విద్యార్థులు పాల్గొంటారని శ్రీనివాసరావు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ఫిజికల్ డైరెక్టర్ ఝాన్సీరాణిని, హెచ్ఎం శ్రీనివాసరావు, విద్యాకమిటీ చైర్మన్ కాసా మల్లికార్జునరావు, తోటి ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది అభినందించారు.

## జల జీవన్ మిషన్ ద్వారా ఏర్పాటైన పంపుల పరిశీలన

అచ్చంపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాదిపాడు పంచాయతీ పరిధిలో గల కంచుబోడు తండాలో జలజీవన్ మిషన్ ద్వారా ఏర్పాటు చేసిన 106 పంపు కనెక్షన్‌లు, చల్లగరిగలో 136, బండారుతండాలో 46 కనెక్షన్లను మంగళవారం ఆర్‌డబ్ల్యూఎస్ క్వాలిటీ కంట్రోల్ డీఈఈ శంకర్ బాబు పరిశీలించారు. ఈ కనెక్షన్‌లు బాగానే నడుస్తున్నట్టు తెలిపారు. ఆయనతో పాటు క్వాలిటీ కంట్రోల్ ఏఈఈ ఎస్కే యాసిన్ క్వాలిటీ కంట్రోల్ ఏఈ దిలీప్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రామారావు తదితరులు పాల్గొన్నారు.

## సుపరిపాలనకు సహకరించండి

● ఎంపీపీ సునీతాసాయిశంకర్

దుర్గి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): నూతనంగా మండలానికి వచ్చిన ప్రభుత్వోద్యోగులు మంచి పరిపాలనకు సహకరించాలని ఎంపీపీ యేచూరి సునీతాసాయిశంకర్ కోరారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఎంపీపీ మాట్లాడారు. ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసికట్టుగా కుటుంబసభ్యుల్లా ఉండాలన్నారు. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అడుగుజాడల్లో నడుస్తూ సుపరిపాలనలో పాలు పంచుకుందామన్నారు. సమావేశంలో ఎంపీడీవో సత్యప్రసాద్, ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు.

## రైతులు పోస్టల్ ఖాతాలు తెరుచుకోవాలి

● ఏవో కే దేవదాసు

నకరికల్లు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో రైతుల పేర్లను జాబితాను ఉంచటం జరిగిందని, ఆ జాబితాలో పేర్లు గల రైతులు పోస్టల్ ఖాతాలను తెరుచుకోవాలని ఏవో కే దేవదాసు రైతులకు సూచించారు. అన్నదాత సుఖీభవ పథకంలో అర్హత ఉండి బ్యాంక్ ఖాతాలు ఇన్ యాక్టీవ్‌లో ఉండటం గాని, ఎన్‌సీసీఐలో లింకు కాక పోవటం గానీ ఉన్న రైతుల జాబితాలను అన్ని ఆర్‌ఎస్‌ఏలలో అందుబాటులో ఉంచామని ఏవో తెలిపారు. అలాంటి రైతులు పోస్టల్ ఖాతాలు తెరుచుకుంటేనే అన్నదాత సుఖీభవ పథకంలో డబ్బులు పడే అవకాశం ఉందన్నారు.

## డీలర్లు సమయపాలన పాటించాలి

● తహసీల్దార్ కిరణ్‌కుమార్

దుర్గి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): డీలర్లు సమయపాలన పాటించాలని తహసీల్దార్ కిరణ్‌కుమార్ సూచించారు. మంగళవారం స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన డీలర్ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రేషన్ దుకాణం ఉదయం 8 గంటలకే తెరిచి ఉంచాలన్నారు. కనీసం ఒకరిద్దరుకైనా రేషన్ అందించాలన్నారు. కార్డుదారులకు ఎంతో ఓపికగా సమాధానం చెప్పాలన్నారు. పలు రేషన్ దుకాణాల్లో సక్రమంగా సరుకులు ఇవ్వడం లేదని తమ దృష్టికి వచ్చిందని, సీఎస్‌డీటీ బాసా తనిఖీలు జరుపుతున్నారని చెప్పారు. ఈ సమావేశంలో ఆర్ఐ యోబు, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, డీలర్లు పాల్గొన్నారు.

## నూరు బాషా సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

మాచర్లటౌన్, జూలై 29(ఆంధ్రజ్యోతి): మాచర్ల పట్టణ నూర్ బాషా సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలు మంగళవారం పట్టణంలో ఘనంగా జరిగాయి. అధ్యక్షుడిగా షేక్ సయ్యద్ ఖాసీం, ప్రధాన కార్యదర్శిగా షేక్ అన్వర్ అక్తర్, కోశాధికారిగా షేక్ మౌలాలి (హోటల్), ఉపాధ్యక్షుడిగా షేక్ మదీన్, సంయుక్త కార్యదర్శిగా చిన్న ఇమాంశు, గౌరవాధ్యక్షుడిగా షేక్ నాసర్‌వలి, క్వాజీగా షేక్ సయ్యద్ హుస్సేన్ ఎన్నికయ్యారు. నూర్‌బాషా సంఘ అభివృద్ధికి కృషి చేస్తామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు.

## అమ్మవారికి విశేష పూజలు

దాచేపల్లి, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : శ్రావణ మంగళ గౌరీ వ్రతాన్ని మంగళవారం మహిళలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. దాచేపల్లి శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో మహిళలు అధికసంఖ్యలో హాజరై అమ్మవారికి కుంకుమ పూజ, దాచేపల్లిలోని శ్రీవీర్లంకమ్మ ఆలయంలో చండీ హోమంలో పాల్గొన్నారు. శ్రావణ, మంగళవారాలను పురస్కరించుకొని దేవాలయాలు భక్తులతో కిటకిట లాడాయి. ఆలయంలో లలిత పారాయణం, కుంకుమార్చనలు నిర్వహించారు.



## వరికపూడిశెలకు నిధుల విడుదల రైతులకు వరం

● బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి హనుమంతరావు

కారంపూడి, జూలై 29(ఆంధ్రజ్యోతి): వరికపూడిశెల ప్రాజెక్టుకు కూటమి రూ.340 కోట్లు నిధులు విడుదల చేసిందని, ఇది రైతులకు వరమని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శెట్టి హనుమంతరావు అన్నారు. మంగళవారం పట్టణంలోని బీజేపీ కార్యాలయం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం రైతులకు మేలు చేసే ప్రభుత్వమని, ఇందుకు నిదర్శనమే వరికపూడిశెలకు నిధులు విడుదలని అన్నారు. అటవీశాఖకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి చెల్లించాల్సిన రూ.14 కోట్లను కూడా ప్రభుత్వం చెల్లించిందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్ల వరికపూడిశెల ప్రారంభిస్తామని ఊకదంపుడు మాటలే తప్ప ఒక్క రూపాయి కూడా నిధులు విడుదల చేయలేదన్నారు. ఈ ప్రాజెక్టు కోసం నరసరావుపేట ఎంపీ లావు కృష్ణదేవరాయలు, మాచర్ల ఎమ్మెల్యే ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి చేసిన కృషి అభినందనీయమన్నారు. హనుమంతరావు వెంట బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు పువ్వాడ శ్రీనివాస్, కోశాధికారి కజ్జం పెద ఆంజనేయులు, జనసేన నియోజకవర్గ కన్వీనర్ బూసా రామాంజనేయులు, టీడీపీ నేతలు అమర సైదారావు, తోట రంగారావు తదితరులు పాల్గొన్నారు.


గరుత్మంతస్వామికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకస్వాములు


ప్రత్యేక పూజలందుకున్న గరుత్మంతస్వామి

# భక్తిశ్రద్ధలతో గరుడపంచమి వేడుకలు

పొన్నూరు టౌన్, జూలై, 29(ఆంధ్రజ్యోతి) : పొన్నూరు పట్టణంలో వేంచేసియున్న గరుత్మంతస్వామి ఆలయంలో గరుడపంచమి వేడుకలు మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 26 అడుగుల ఏకశిల గరుత్మంతస్వామి విగ్రహానికి వేకువజాము నుంచే ప్రత్యేక పూజలు జరిపారు. పట్టణంలోని శ్రీవీరాంజనేయస్వామి ఆలయంలో ఉపాలయంగా వెలుగొందుతున్న గరుత్మంతస్వామి ఆలయంలో గరుడపంచమి వేడుకల్లో పాల్గొనేందుకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వామి వారికి వందలాది లీటర్ల పాలు, పెరుగు, పంచామృతాలతో అభిషేకాలను కన్నులపండువగా నిర్వహించారు. అనంతరం ప్రత్యేక అలంకరణలు చేసి పుష్పయాగ కార్యక్రమాలు జరిగాయి. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా రూపొందించిన కళ్యాణ వేదికపై రుద్ర, శుక్రుత సమేత గరుత్మంతస్వామి కల్యాణ మహోత్సవాన్ని అంగరంగవైభవంగా నిర్వహించారు. రాష్ట్రంలోనే తొలిదేవాలయంగా వెలుగొందుతున్న గరుత్మంతస్వామిని వీక్షించేందుకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. ఆలయ ఈవో గద్దె వెంకటఅమర్నాథ్ ఆధ్వర్యంలో ఉత్సవ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

# సోలార్ పవర్.. బీసీలకు బంపర్ ఆఫర్



❖ మూడు కిలోవాట్స్‌పై 98 వేలు సబ్సిడీ ❖ దరఖాస్తులు స్వీకరిస్తున్న ట్రాన్స్‌కో అధికారులు

వేమూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బీసీలకు మరో వరం ప్రకటించడం జరిగింది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం సూర్యఘర్ బిజిలి యోజన ద్వారా ఉచిత విద్యుత్ స్కీమ్‌లో భాగంగా బంపర్ ఆఫర్‌తో రాయితీలు ప్రకటించింది. ఒక కిలోవాట్ సోలార్ ప్యానల్ ఏర్పాటు చేసుకుంటే రూ.30 వేలు, రెండు కిలోవాట్స్‌పై రూ.60 వేలు, మూడు కిలోవాట్స్‌పై రూ.78 వేలు రాయితీలు ప్రకటించింది. తద్వారా బీసీలకు అధికంగా సబ్సిడీ పొందే అవకాశం లభించింది. ముఖ్యమంత్రి సౌరవిద్యుత్ విషయంలో కొన్ని కీలక ప్రకటనలు చేస్తూ ప్రతి నియోజకవర్గంలో కనీసం 10 వేల ఇళ్లపై రూఫ్ టాప్ సోలార్ ప్యానల్స్ ఏర్పాటు జరపాలని ఎమ్మెల్యేలకు సూచించారు. ఈ మేరకు ట్రాన్స్ కో అధికారులు కూడా స్పందించి విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఇందులో భాగంగా ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు 200 యూనిట్స్ వరకు విద్యుత్ ఉచితంగా పొందే సోలార్ సిస్టం ఏర్పాటుకు ప్రభుత్వమే నూరు శాతం రాయితీపై వాటిని ఏర్పాటు చేయడానికి దీనిని విస్తృతపరిచే ప్రక్రియలో భాగంగా ముఖ్యమంత్రి బీసీలకు ప్రత్యేకంగా సబ్సిడీని ప్రకటించారు. ఉదాహరణకు మూడు కిలోవాట్స్ సోలార్ సిస్టం ఏర్పాటుకు రూ.2 లక్షల ఖర్చు అవుతుంది. అయితే ఆ మొత్తాన్ని దరఖాస్తు చేసుకున్న బీసీ వినియోగదారులకు ముందుగానే బ్యాంకు ద్వారా రుణం ఇప్పించడం జరుగుతుంది. అనంతరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అనుమతితో రుణం పొందిన వారంలో గాని మీటరు ఏర్పాటు చేసిన అతి తక్కువ కాలంలోనే ప్లేట్స్ ఏర్పాటు చేయడం జరుగుతుందని ట్రాన్స్ కో అధికారులు వినియోగదారులకు ఇంటింటి ప్రచారం ద్వారా తెలియజేస్తున్నారు. మూడు కిలోవాట్స్‌కు రాష్ట్ర ప్రభుత్వం రూ.20 వేలు సబ్సిడీ అందించనుండగా కేంద్ర ప్రభుత్వం రూ.78 వేలు సబ్సిడీ ఇవ్వనుంది. దీంతో వినియోగదారునికి రూ.1.02 లక్షలకే సోలార్ సిస్టం ఏర్పాటు చేసుకునే అవకాశం ఏర్పడుతుంది. సబ్సిడీ సొమ్మును వినియోగదారుని బ్యాంకు ఖాతాలో జమ చేస్తారు. బ్యాంకుల ద్వారా ఇచ్చే రుణానికి కేవలం రూ.50 పైసలు మాత్రమే వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది.

### దరఖాస్తుల సేకరణకు గడువు లేదు

సబ్సిడీపై సోలార్ సిస్టం ఏర్పాటు చేసుకోదలచిన బీసీ వినియోగదారులు దరఖాస్తు చేసుకునేందుకు గడువు లేదని నిరంతర ప్రక్రియగా పథకాన్ని అమలు చేయడం జరుగుతుందని ట్రాన్స్ కో అధికారులు పేర్కొంటున్నారు.

# యోగా పోటీలు ప్రారంభం

వివిధ రాష్ట్రాల నుంచి 278 మంది విద్యార్థుల హాజరు



గరుడ ఆసనాన్ని ప్రదర్శిస్తున్న విద్యార్థులు

చిలకలూరిపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారతదేశ పరిధిలో ఉన్న జవహర్ నవోదయ విద్యాలయ విద్యార్థుల మూడు రోజుల ప్రాంతీయ యోగా ప్రదర్శన పోటీలు చిలకలూరిపేట మండలం మద్దిరాలలో ఉన్న జవహర్ నవోదయ విద్యాలయంలో మంగళవారం ప్రారంభమయ్యాయి. కేరళ, కర్నాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, పాండిచ్చేరి రాష్ట్రాలకు చెందిన 77 నవోదయ విద్యాలయాల విద్యార్థులు 278 మంది ఉత్సాహంగా ఈ పోటీలలో పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన చిలకలూరిపేట మున్సిపల్ కమిషనర్ పీ శ్రీహరిబాబు యోగా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శారీరక, మానసిక ఆరోగ్యానికి ఉత్తమ సాధనం యోగా అని అన్నారు. మద్దిరాల నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ ఎస్ నరసింహారావు మాట్లాడుతూ విద్యార్థులు నవోదయ విద్యాలయాలలో కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని కలలను సాకారం చేసుకోవాలని ఆకాంక్షించారు. విశిష్ట అతిథులుగా పాల్గొన్న ధనలక్ష్మి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ డైరెక్టర్ లింగయ్య చౌదరి, నవోదయ విశ్రాంత సహాయక కమిషనర్ ప్రభాకరరెడ్డి యోగా ప్రాముఖ్యత గురించి వివరించారు. పోటీలలో పాల్గొన్న విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. స్థానిక నవోదయ విద్యాలయ విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపల్లిలో సూపర్‌ఫాస్టు రైలు ఆగుతున్నా సున్నా రిజర్వేషన్ ● రోజుకు కనీసం ఐదుగురు కూడా ప్రయాణించడం లేదు ● కాగ్ ఆడిటింగ్ చేస్తే అధికారులకు ఇబ్బందే

# సౌకర్యమున్నా.. ఆదరణ సున్నా

**గుంటూరు రైల్వేడివిజన్‌లో కొన్నిరైల్వే స్టేషన్లు గుదిబండలా మారాయి. వాటిల్లో రోజుకు కనీసం ఐదుగురు ప్రయాణీకులు కూడా రైళ్లలో ప్రయాణించడం లేదు. పైగా ఈ స్టేషన్లు బ్రాంచ్ లైన్లలో లేవు. మెయిన్‌లైన్లలో ఉన్నా ఆదరణ లేకపోవడం ఆందోళన కలిగిస్తోన్నది. ఈ నేపథ్యంలో కంప్ట్రోలర్ అండ్ ఆడిటింగ్ జనరల్ గుంటూరు రైల్వేడివిజన్‌లో ఆడిట్ చేస్తే మాత్రం ఆయా స్టేషన్లలో రైళ్లు ఆగేందుకు జస్టిఫికేషన్ ఇచ్చిన అధికారుల మెడకు చుట్టుకోవడం ఖాయం. అలానే రెవెన్యూ రికవరీ కూడా ఆదేశాలు జారీ చేసే అవకాశం లేకపోలేదు.**

గుంటూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): నడికుడి - పగిడిపల్లి మధ్యన కొన్ని రైల్వేస్టేషన్లు ఉన్నాయి. వీటిల్లో ఎక్కువగా మెమూ రైళ్లకు స్టాపేజ్ సౌకర్యం ఉన్నది. పొందుగల రైల్వేస్టేషన్ ఊరికి చాలాదూరంగా అడవిలో ఉన్నట్లు ఉంటుంది. ఈ కారణంగా దీనికి అసలు ప్యాసింజర్ అవుట్‌వర్డ్ ట్రాఫిక్ ఉండటం లేదు. ఏడాది లెక్కలు తీస్తే కేవలం 122 మంది ప్రయాణికులు మాత్రమే ఇక్కడ టిక్కెట్‌లు కొనుగోలు చేసి ప్రయాణించారు. దీనిని పరిగణనలోకి తీసుకొంటే రోజుకు కనీసం ఒక్కరు కూడా ప్రయాణం చేయలేదు. శ్రీరాంపురం రైల్వేస్టేషన్‌లో కేవలం 411 మంది ప్రయాణించారు. ఈ రైల్వేస్టేషన్‌లో రోజుకు సగటున ఇద్దరు కూడా ప్రయాణించలేదు. వలిగొండ రైల్వేస్టేషన్‌లో ఏడా దిలో మొత్తంగా 1117 మంది రైలులో ప్రయాణం చేశారు. రోజుకు ముగ్గురు కూడా రైళ్లు ఎక్కలేదు. అయినప్పటికీ మెమూ రైళ్లను నడుపుతున్నారు. దీనివలన




ఆపరేషనల్ సమస్యలే కాకుండా రెవెన్యూ పరంగానూ లోటు ఏర్పడుతున్నది.

నాగిరెడ్డిపల్లి రైల్వేస్టేషన్‌లో అయితే పల్నాడు సూపర్‌ఫాస్టు ఎక్స్‌ప్రెస్‌కు స్టాపేజ్ ఉన్నది. అయినప్పటికీ ఇక్కడ రిజర్వేషన్ టిక్కెట్‌లు ఒక్కటి కూడా బుకింగ్ కావడం లేదు. చిట్యాలలోనూ పల్నాడు ఎక్స్‌ప్రెస్‌కి నిలుపుదల సౌకర్యం ఉన్నది. ఇక్కడ ఏడాది పొడవునా చూస్తే 740 మంది రిజర్వు చేసుకొన్నారు. రైల్వే నిబంధనల ప్రకారం ఏదైనా రైల్వే స్టేషన్‌లో రైళ్లను నిలుపుదల చేయాలంటే కనీసం 50 టిక్కెట్‌లు రోజుకు సగటున బుకింగ్ జరగాలి. దీనిని పరిగణనలోకి తీసుకొంటే ఏడాదిలో 18250 టిక్కెట్‌లు కనీసం బుకింగ్ జరగాలి. ఈ లెక్కన పొందుగల, శ్రీరాంపురం, వలిగొండ, తిప్పర్తి, చిట్యాలలో కనీసం కంటే చాలా తక్కువగా టిక్కెట్‌లు బుకింగ్ జరుగుతున్నాయి. అయినప్పటికీ ఏ కారణం చేతనో రైల్వే అధికారులు వాటిల్లో స్టాపేజ్‌లను కొనసాగిస్తున్నారు. ఇటీవల కాగ్ చెన్నై - ఎస్ఎస్‌పీఎస్ రైలు విషయంలో కేవలం రెండు శాతం ఆక్యుపెన్సీతో నడుపుతున్నారని తప్పు పట్టింది. అందుకు బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేసింది. ఉన్నతాధికారులు ఈ విషయంలో తగిన చర్యలు తీసుకోకపోతే అలాంటి పరిస్థితే గుంటూరు రైల్వే డివిజన్‌లోనూ తలెత్తే అవకాశం లేకపోలేదు.


మూడు లేన్లుగా విస్తరించే గుంటూరు ఆర్వోబీ

# ఆర్వోబీల విస్తరణకు రూ.54 కోట్లు

● ఎన్‌హెచ్-16పై రెండు చోట్ల మూడు లేన్లుగా మార్పు ● కొలనుకొండ, గుంటూరు ఆర్వోబీలకు కేంద్రం నిధులు

గుంటూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని జాతీయ రహదారి ఎన్‌హెచ్ 16పై రెండు ఆర్వోబీల విస్తరణకు ముందడుగు పడింది. ఎన్‌హెచ్ 16 మూడు లేన్లుగా మారినా రెండు చోట్ల ఆర్వోబీల వద్ద మాత్రం రెండు లేన్లుగానే ఉంది. ఈ ఆర్వోబీల వద్ద దశాబ్దాల తరబడి రోడ్డు ఇరుకుగా ఉంది. 40 కిలోమీటర్ల వ్యత్యాసంలో గుంటూరు, విజయవాడ వంటి రెండు పెద్ద నగరాలు ఉండడం.. ఈ మధ్య లోనే ఆర్వోబీల వద్ద హైవే ఇరుకుగా ఉండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా చొరవ తీసుకుని రెండు ఆర్వోబీల విస్తరణకు రూ.54 కోట్లు మంజూరు చేసిం ది. తాడేపల్లి మండలం కొలను కొండ వద్ద ప్రస్తుత డీజీపీ కార్యాలయానికి సమీపంలోని ఆర్వోబీ వద్ద నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతూ ఉంటుంది. రోడ్డంతా మూడు లేన్లుగా ఉంటూ, ఒక్కసారిగా ఆ ఆర్వోబీ దగ్గర రెండు లే న్లుగా కుదించుకుపోయి ఉండడంతో ప్రమాదాలు కూడా ఎక్కువగా జరుగుతున్నాయి. ఈ వంతెన విస్తరణకు రూ.36 కోట్లు కేటాయింపుతో దశాబ్దకాలానికి పైగా ఉన్న సమస్యకు చెక్ పడనున్నది.

గుంటూరులో బుడంపాడు పై ఓవర్‌కు సమీపంలో గుంటూరు, తెనాలి రైల్వే ట్రాకుపై విజయవాడ నుంచి చెన్నై వైపు వెళ్లే రోడ్డుపై ఆర్వోబీ మూడు లేన్లుగా, చెన్నై నుంచి విజయవాడ వైపు వెళ్లే రోడ్డులో రెండు లేన్లుగా ఉంది. ఇప్పుడు ఈ రెండు లేన్ల వంతెనను మూడు లేన్లుగా విస్తరించేందుకు కేంద్రం రూ.18 కోట్లు కేటాయించింది. రెండేళ్లలో ఈ రెండు ఆర్వోబీలను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఎన్‌హెచ్ఏఐ అధికారులు చెబుతున్నారు.

# గాలిలో నాణ్యతను పెంపొందించాలి

జాతీయ క్లీన్ ఎయిర్ కార్యక్రమాలు నిర్వహించాలి

పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సమావేశంలో కలెక్టర్ ఆదేశాలు

గుంటూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పర్యావరణ పరిరక్షణకు, గుంటూరు నగరంలో గాలి నాణ్యతను పెంపొందించేందుకు జాతీయ క్లీన్ ఎయిర్ కార్యక్రమాలు సంబంధిత శాఖలు పకడ్బందీ ప్రణాళిక ప్రకారం నిర్వహించాలని కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ మినీ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్ అమలు కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న పదేళ్లలో గాలిలో కాలుష్యాన్ని 70 నుంచి 80 శాతం వరకు తగ్గించే లక్ష్యంతో కాలుష్యాన్ని తగ్గించి పచ్చదనం పెంచే కార్యక్రమాలకు నిధులు మంజూరవుతున్నాయన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గుంటూరు కార్పొరేషన్ రూ.2.73 కోట్ల అంచనాతో ప్రతిపాదించిన పనులను నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం సకాలంలో పూర్తి చేయాలన్నారు. జీజీహెచ్, ట్రావెలర్స్ బంగ్లా వద్ద ఉన్న నేషనల్ ఎయిర్ మానిటరింగ్ ప్రోగ్రాం ద్వారా ఏర్పాటు చేసిన స్టేషన్లను ప్రత్యామ్నాయ ప్రాంతాలకు మార్చాలన్నారు. జిల్లాలో తెనాలి, పొన్నూరు పరిసర ప్రాంతాల్లో వ్యవసాయ, పశువుల వ్యర్థాలతో బయోగ్యాస్ తయారీ ప్లాంట్ ఏర్పాటుకు నెడ్ క్యాప్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమా వేశంలో న గ ర పాల క సం స్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, ఏపీ పోల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎన్విరాన్‌మెంట్ ఇంజనీరు ఎండీ నజీనబేగం, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజరు జయలక్ష్మి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి(ఇన్చార్జి) చంద్రముని, నగరపాలక సంస్థ ఈఈ సుందరరామిరెడ్డి, ఎంవీఐ మల్లేశ్వరి, ఆర్టీసీ కమర్షియల్ మేనేజరు ఆర్‌వీ కోటేశ్వరరావు పాల్గొన్నారు.


కలెక్టరేట్‌లో జరిగిన పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, కమిషనర్

# సాగర్‌లో పర్యాటకుల సందడి


సాగర్‌లో సందడి చేస్తున్న పర్యాటకులు

విజయపురిసౌత్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయానికి శ్రీశైలం నుంచి భారీగా వరద వస్తుండడంతో సాగర్ ప్రాజెక్టు 26 క్రస్ట్‌గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 2,04,048 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో పర్యాటకులు భారీగా సాగర్‌ను సందర్శించారు. సాగర్‌లోని నూతన బ్రిడ్జి, పడిపోయిన బ్రిడ్జి, పుష్కరఘాట్ వద్ద పర్యాటకుల సందడి నెలకొంది. మాచర్ల రూరల్ సీఐ నఫీజ్ బాషా పర్యవేక్షణలో విజయపురిసౌత్ ఎస్ఐ అశోక్ ఆధ్వర్యాన పర్యాటకులు రద్దీగా ఉన్న ప్రాంతాల్లో ట్రాఫిక్ క్రమబద్ధీకరిస్తూ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.


విద్యుత్ వెలుగుల్లో నాగార్జున సాగర్ ప్రాజెక్ట్

# పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట



## సుపరిపాలన అందించటమే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే చదలవాడ

రొంపిచర్ల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు సుపరిపాలన అందించటమే కూటమి ప్రభుత్వ లక్ష్యంగా పెట్టుకుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు అన్నారు. మండలంలోని సంతగుడిపాడులో మంగళవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నారన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక వైసీపీ నేతలు విమర్శలు చేస్తున్నారన్నారు. ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాల పత్రాలను పంపిణీ చేశారు. సోమవారం రాత్రి కొత్తపల్లిలో జరిగిన తొలిఅడుగు కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రొంపిచర్లలో నకిలీ బంగారం కలకలం

రొంపిచర్ల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రొంపిచర్లలో నకిలీ బంగారంపై కలం కలం రేగిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తి రొంపిచర్లలోని బ్యాంక్ వద్దకు ఈనెల 28వ తేదీన బంగారు తాకట్టు పెట్టడానికి వచ్చాడు. సదరు బంగారాన్ని నరసరావుపేటలోని ఓ ప్రముఖ బంగారం షాపులో కొనుగోలు చేశాడు. ఐతే అతను తీసుకువచ్చిన రెండు వస్తువుల్లో ఒకటి బ్యాంక్ నియమాలకు సరిపోయిందని, మరొకటి సరిపోలేదని తిరస్కరించినట్టు మేనేజర్ తెలిపాడు. కొనుగోలుకు సంబంధించిన సర్టిఫికెట్‌ను కూడా తాకట్టు పెట్టడానికి వచ్చిన వ్యక్తి చూపించాడు. ఐతే మంగళవారం నరసరావుపేటలోని జ్యూవెలరీ షాపు నుంచి ఐదుగురు వ్యక్తులు బ్యాంక్ వద్దకు వచ్చి మేనేజరుతో మాట్లాడారు. తమ బంగారం మంచిదేనని, మీ వద్ద ఉన్న నాణ్యతకు సంబంధించిన పరీక్షల్లో లోపం ఉందని పేర్కొన్నట్టు సమాచారం. ఈ విషయం గ్రామంలో చర్చనీయాంశమైంది.



మానసాదేవి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకుడు

## వైభవంగా నాగుల పంచమి

రొంపిచర్ల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో శ్రావణ మాసం మంగళవారం సందర్భంగా నాగుల పంచమి పూజలు ఘనంగా జరిగాయి. రొంపిచర్ల, కొనకంచివారిపాలెం, గోగులపాడు, వడ్లమూడివారిపాలెం, విప్పర్ల, మాచవరం, పరగటిచర్ల, వీరవట్నం గ్రామాల్లో శివాలయాలు, నాగేంద్రస్వామి విగ్రహాల వద్ద, పుట్టల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. విప్పర్లలోని వల్లభేశ్వరస్వామి ఆలయంలో మానసాదేవి జంట నాగులకు అభిషేకాలను నిర్వహించారు. భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. స్వామివార్లను దర్శించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

### బొల్లాపల్లి మండలంలో...

బొల్లాపల్లి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేమిడిచర్లలో మంగళవారం నాగపంచమి పూజలు ఘనంగా జరిగాయి. నాగ పంచమి, శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామికి, నాగేంద్ర స్వామికి, గంగాగౌరి శంకరుడికి పంచామృతాభిషేకాలు, అలంకారాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ప్రత్యేక పూజలు చేశారు.

## మండల పరిషత్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ మృతి

రొంపిచర్ల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రొంపిచర్ల మండల పరిషత్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ పల్లా రవి కుమార్ (45) గుండె పోటుతో మంగళవారం తెల్లవారు జామున మృతి చెందినట్టు బంధువులు పేర్కొన్నారు. ఈపూరు మండలం ముప్పాళ్ళలోని ఆయన స్వగృహంలో మృతి చెందినట్టు తెలిపారు. సమాచారం తెలుసుకున్న ఎంపీడీవో కే మాధ్యూబాబు, పంచాయతీ కార్యదర్శులు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మట్టిఖర్చుల కింద రూ.20వేలు కుటుంబ సభ్యులకు అందజేశారు.

## క్షయ వ్యాధిపై ప్రజలు అవగాహన పెంచుకోవాలి: వైద్యాధికారి

రొంపిచర్ల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): క్షయ వ్యాధిపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని రొంపిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పోతిరెడ్డి జగన్ నరసింహారెడ్డి మంగళవారం పేర్కొన్నారు. పీహెచ్‌సీ పరిధిలోని పది గ్రామీణ ఆరోగ్య కేంద్రాల్లో పరీక్షలు ఉచితంగా చేస్తున్నట్టు పేర్కొన్నారు.

## కౌలు రైతు కార్డులకు దరఖాస్తు చేసుకోవాలి: ఏడీఏ

నాదెండ్ల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): అర్హత కలిగిన ప్రతి ఒక్కరు కౌలు రైతు కార్డులకు దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీనివాసరావు కోరారు. మండలంలోని అమీన్‌సాహెబ్‌పాలెంలో సోమవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. శ్రీనివాసరావు మాట్లాడుతూ పంటవేసిన పత్తి రైతు పంట నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కామినేని లలిత నాగేశ్వరరావు, కార్యదర్శి ఇందిర, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి గుర్రం నాగ పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

● నూజెండ్ల: జీవన ఎరువుల వినియోగంతో పంటలకు ప్రయోజనం కలుగుతుందని జిల్లా వనరుల కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ ఎం శివ కుమారి అన్నారు. మంగళవారం మండలంలోని పాతచెరుకుంపాలెంలో ప్రధానమంత్రి రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకంలో భాగంగా రైతులకు జీవన ఎరువుల వినియోగంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి ఎం అంజనేయులు నాయక్, జిల్లా వనరుల కేంద్రం అరుణ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో నిలిచిన ఆటలు

- మూడు సంవత్సరాలు వ్యాయామ ఉపాధ్యాయులే లేరు
- బదిలీపై వెళ్ళిన వారి స్థానంలో నియామకాలు నిల్
- ఆగస్టులోనైనా భర్తీ అయ్యేనా?



వెల్లటూరు పాఠశాల క్రీడా మైదానంలో కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు (పాత చిత్రం)

బొల్లాపల్లి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): క్రీడలు విద్యార్థుల శారీరక దృఢత్వాన్ని, మానసిక ఆనందాన్ని పెంపొందించుతాయని క్రీడల ప్రాముఖ్యతను గుర్తించిన విద్యా శాఖ పాఠశాలల్లో కాల పట్టికలో ప్రత్యేక సమయం కేటాయించింది. దీంతో ప్రతిరోజు ఏదొక ఆటలను పిల్లలతో ఆడించేవారు. క్రీడల్లో రాణించిన విద్యార్థులకు అందజేసే సర్టిఫికెట్, వారికి ఉన్నత చదువులు, ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేందుకు దోహదపడుతున్నాయి. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన క్రీడలను నేర్పించేందుకు పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయులను ప్రభుత్వం నియమించటం లేదు. మండలంలో ఎనిమిది జడ్పీ ఉన్నత పాఠశాలలు, ఒక ఆదర్శ పాఠశాల, ఒక కేజీబీవీ పాఠశాలతో పాటు జూనియర్ కళాశాల ఉంది. ఆరు నుంచి ఇంటర్ వరకు సుమారు మూడు వేలమంది వరకు చదువుతున్నారు. గతంలో మండలం నుంచి రాష్ట్ర స్థాయిలో జరిగిన క్రీడల్లో విద్యార్థులు రాణించారు. క్లిప్పింగ్, రోప్, రన్నింగ్ రేస్ తదితర క్రీడల్లో ఈ ఘనతను సాధించారు. అలాగే కబడ్డీ, ఖోఖో, బాడ్మింటన్‌లలో జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో రాణించిన విద్యార్థులు ఉన్నారు. సుమారు మూడు సంవత్సరాల నుంచి పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయులు లేరు. దీంతో మైదానాల్లో ఆటలు కరువయ్యాయి. కాగా ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన మెగా డీఎస్సీలో అర్హులైన వారికి ఆగస్టులో నియామక పత్రాలు అందనున్నాయి. వారితోనైనా వ్యాయామ ఉపాధ్యాయుల భర్తీ జరుగుతుందని పాఠశాలల హెచ్‌ఎంలు అంటున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమస్యపై దృష్టి సారించి పాఠశాలల్లో క్రీడలను ప్రోత్సహించేలా వ్యాయాయ ఉపాధ్యాయులను నియమించి విద్యార్థులను క్రీడాకారులుగా తీర్చిదిద్దాలని పలువురు తల్లిదండ్రులు కోరుతున్నారు.

## ఇన్‌చార్జిల నియామకాలతో కుంటుపడుతున్న పాలన

శావల్యాపురం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ శాఖలలో రెగ్యులర్ ఉద్యోగులకు బదులుగా ప్రభుత్వం ఇన్‌చార్జిలకు బాధ్యతలు అప్పగిస్తుండడంతో ప్రజలకు ప్రభుత్వ సేవలు సక్రమంగా అందక పాలన పూర్తిస్థాయిలో కుంటుపడుతుందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉపాధి హామీ ఏపీవోగా విధులు నిర్వహిస్తున్న రామారావు జూన్ నెలాఖరున ఉద్యోగ విరమణ పొందడంతో ఆయన స్థానంలో నూజెండ్ల మండలం ఏపీవో అంజనేయరాజుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. వెలుగు ఏపీఎంగా విధులు నిర్వహిస్తున్న వాసుబాబును జిల్లా కార్యాలయానికి బదిలీ చేయడంతో ఆయన స్థానంలో వినుకొండ ఏపీఎం రామాంజనేయులుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈపూరు ఎంపీవోగా విధులు నిర్వహిస్తున్న రామారావు గత మూడేళ్ళుగా ఇక్కడ ఇన్‌చార్జి ఎంపీవోగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈపూరు మండలంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా విధులు నిర్వహిస్తున్న రత్నబాబుకు ఇక్కడ ఇన్‌చార్జిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఏవో పోస్టు గత రెండేళ్ళుగా ఖాళీగానే ఉంది. కారుమంచి పశువైద్యశాలల్లో వైద్యాధికారిగా విధులు నిర్వహించిన గుణధీర్ ఇటీవల బదిలీ కావడంతో వేల్పూరు పశువైద్యాధికారి గణేశ్‌కుమార్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. అంతేకాకుండా మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న సీతారామయ్యకు బొల్లాపల్లి మండలానికి ఇన్‌చార్జి ఎంపీడీవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు. స్థానిక ఎంఆర్సీ కార్యాలయంలో ఎంఈవోగా విధులు నిర్వహిస్తున్న సాంబశివరావుకు నూజెండ్ల, దుర్గి మండలాలకు ఇన్‌చార్జి ఎంఈవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇటీవల ఆయన అనారోగ్య కారణాలతో సెలవు పెట్టడంతో వినుకొండ ఎంఈవో జ్వాల్లాకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇలా మండలంలోని ప్రముఖ శాఖల్లో ఇన్‌చార్జిలతో కాలం గడుపుతుండడంతో ప్రజలకు సక్రమంగా ప్రభుత్వ సేవలను అందించలేకపోతున్నారు. వీరిలో కొందరు ఉద్యోగులు దీన్ని అదనుగా తీసుకొని ప్రజలకు అందుబాటులో ఉండకుండా తప్పించుకుంటున్నారు.

వీరిలో కొందరు ఏళ్ళతరబడి ఇన్‌చార్జిలుగా కొనసాగుతున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకుండా మండల పాలనపై నిర్లక్ష్యధోరణి కనబరుస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి ఇన్‌చార్జిల స్థానంలో రెగ్యులర్ ఉద్యోగులను నియమించి ప్రభుత్వసేవలు మరింత సులభతరం చేయాలని ప్రజలు కోరుతున్నారు.




ఫ్లోర్‌బాల్ జిల్లా జట్టుకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ బర్నబాస్, డైరెక్టర్ కే నాసరయ్య తదితరులు

## ఫ్లోర్ బాల్ జిల్లా జట్టుకు కే-రిడ్జి విద్యార్థుల ఎంపిక

నరసరావుపేట టౌన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా ఫ్లోర్ బాల్ జట్టుకు కే-రిడ్జి విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ బర్నబాస్ మంగళవారం తెలిపారు. ఈ నెల 27న వినుకొండ లయోలా హైస్కూల్‌లో జరిగిన ఫ్లోర్ బాల్ అండర్-14, అండర్-19 పల్నాడు జిల్లా జట్టుల ఎంపికలో కే-రిడ్జి విద్యార్థులు ప్రతిభ చాటారన్నారు. అండర్-14 బాలికల జట్టుకు ఉపగన చౌదరి, నాటకాల గురుహంసిని, సోమేపల్లి లీలలోహిత, మెడగం నిహారిక, బొల్లా యశస్వినీ, డీ రమ్య, ఎం.అమూల్య ఎంపికయ్యారు. అండర్-14 బాలుర జట్టుకు బీ వెంకటగౌతమ్, ఎం.భానుప్రసాద్, జె.ధరహాస్, జయేష్, ఎన్.సాయి, డీ కార్తికేయ, ఎం.నిఖిత్, ఎల్.మణికంఠరెడ్డి, జీ ధనుష్ ఎంపికయ్యారు. అండర్-19 బాలుర జట్టుకు జీ జస్వంత్, కే రక్షణ్, సీహెచ్ వెంకటసంజయ్, జె.చిన్మయి శ్రీనివాస్, జీ సుజిత్‌తేజ, సీహెచ్ విష్ణువర్ధన్, జె రోహిత్, వీ చంద్రకిరణ్, బీ శ్రీకర్, ఎస్.శశాంక్, పీ కోటేశ్వరరావులు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులు ఆగస్టు 3న నరసరావుపేట కే-రిడ్జి ఇంటర్నేషనల్ స్కూల్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. విద్యార్థులను స్కూల్ ఛైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు, డైరెక్టర్ కోమటినేని నాసరయ్య, ఇన్‌చార్జి బాపూజీ, పిజికల్ డైరెక్టర్ ఎం.కిషోర్‌బాబు, పీఈటీ శేషగిరి, మహిత అభినందించారు.

## సాగు యాజమాన్య పద్ధతులపై శిక్షణ



శిక్షణలో మాట్లాడుతున్న జిల్లా వనరుల కేంద్రం అధికారి ఎం.శివకుమారి

వినుకొండ, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదకంచర్లలో మంగళవారం రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా వనరుల కేంద్రం అధికారి ఎం.శివకుమారి పాల్గొని మాట్లాడుతూ రైతులకు వరి యాజమాన్యం, విత్తన రకాలు, విత్తన శుద్ధి, ఎరువుల యాజమాన్యం, జీవన ఎరువుల వాడకం, చీడపీడల నివారణ గురించి అవగాహన కల్పించారు. అనంతరం ఏవో వరలక్ష్మి మాట్లాడుతూ ఆగస్టు 15లోపు పంటల బీమాకు ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లిస్తే రైతుల పంటకు ప్రకృతి వైపరీత్యాల సంభవించినప్పుడు, చీడపీడలు ఆశించి దిగుబడులు తగ్గినప్పుడు పంటలకు బీమా వర్తిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏవో అరుణ, ఏఈవో ఆరిఫ్, వీపీఏ యశ్వంత్, సిబ్బంది పాల్గొన్నారు.

## రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి: ఏవో

ఈపూరు, జులై 29 (ఆంధ్రజ్యోతి): రైతులు పంటలకు రసాయనిక ఎరువులు వాడకం తగ్గించాలని మండల వ్యవసాయ శాఖ అధికారి ఆర్.రామారావు అన్నారు. మండలంలోని బొగ్గరం, కొండాయపాలెం గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న ఏవో మాట్లాడుతూ రసాయినిక ఎరువుల వాడకం ఎరువుల వాడకం తగ్గించడం వలన పెట్టుబడి తగ్గడంతో పాటు భూమిని కాపాడుకోవచ్చన్నారు. ఆరోగ్యవంతమైన పంటలు పండించవచ్చు అన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతుంది కాబట్టి రైతులు లైసెన్స్ ఉన్న షాపుల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలని అంతేకాకుండా రసీదును తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఏఈవో సునీత, మాధవి, రైతులు పాల్గొన్నారు.

## మేజర్ డ్రెయిన్‌లో పూడికతీత



మేజర్ డ్రెయిన్‌లో పూడికతీస్తున్న కార్మికులు

వినుకొండ టౌన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీతయ్యనగర్, వెన్నపూస కాలనీలోని ఉన్న మేజర్ డ్రెయిన్‌లో డీసిల్టేషన్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ సుభాష్‌చంద్ర బోస్ మాట్లాడుతూ సుపరిపాలన- తొలి అడుగు ఇంటింటికి కార్యక్రమంలో భాగంగా 1వ వార్డులో పర్యటించిన ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు ఆదేశాల మేరకు, మున్సిపల్ ఛైర్మన్ షేక్ దస్తగిరి సూచనలతో మేజర్ మురుగుకాలువలో సిల్టు తొలగింపు పనులు చేపట్టినట్లు వివరించారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని కాలువల్లో పూడికతీత పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇస్మాయిల్, సిబ్బంది పాల్గొన్నారు.

## తల్లికి వందనం చారిత్రాత్మక పథకం

● చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు



జయంతిరామ్‌పురంలో గ్రామస్థులకు కరపత్రాలను పంపిణీ చేస్తున్న చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

బొల్లాపల్లి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం చారిత్రాత్మక పథకమని ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. మండలంలోని జయంతిరామ్‌పురం, మేళ్ళవాగు గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మంగళవారం రాత్రి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ ఎన్నికలకు ఇచ్చిన హామీ మేరకే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎంతమంది అర్హులైన విద్యార్థులు ఉంటే అందరికీ రూ.13వేలు చొప్పున తల్లుల ఖాతాల్లో జమ చేశారని, సూపర్-6 పథకాలను అమలు చేస్తున్న ఘనత చంద్రబాబుదేనన్నారు. ప్రతిపక్ష పార్టీలు ఎన్ని విమర్శలు చేసినా సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ళుగా ప్రభుత్వ పాలన సాగుతుందన్నారు. ప్రచారంలో భాగంగా ఇంటింటికి వెళ్ళి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు వాటి అమలు తీరు గురించి వివరించారు. ప్రభుత్వ పథకాలకు సంబంధించి కరపత్రాలను గ్రామస్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నేతలు పెమ్మసాని నాగేశ్వరరావు, ఆరికట్ల వాసుదేవ రెడ్డి, పరిటాల రామచంద్రయ్య, శాఖమూరి రామ్మూర్తి, పూల మస్తాన్‌రావు, హనుమా నాయక్, గోవిందు నాయక్, బారెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ఎలిశెట్టి రంగయ్య, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

### మాజీ వైస్ ఎంపీపీ సుబ్బమ్మకు నివాళి

ఈపూరు, జులై 29 (ఆంధ్రజ్యోతి): మాజీ వైస్ ఎంపీపీ జల్లిపల్లి సుబ్బమ్మ (70) మృతి చెందారు. మంగళవారం ఆమె మృతదేహంను చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, డీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, డీసీ ఛైర్మన్ గడుపూడి వేణుగోపాలరావు, టీడీపీ నాయకులు పెమ్మసాని నాగేశ్వరరావు, మాజీ ఎంపీపీ బయలు అడుగు, రామయ్య తిప్పిశెట్టి వెంకటేశ్వర్లు, జనసేన నాయకులు కే నాగశ్రీను, తదితరులు ఘనంగా నివాళి అర్పించారు.

## రోడ్లు బాగు చేయండి: మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



నరసరావుపేటలో అధ్వానంగా ఉన్న రోడ్లను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): 2025 సంక్రాంతిలోపు రోడ్లన్నీ బాగు చేస్తాం అన్న ఈ ప్రభుత్వం ఇంతవరకు నరసరావుపేటలోని రోడ్లను ఎందుకు బాగు చేయలేకపోయారని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రశ్నించారు. 14 నెలలలో అప్పుల పేరుతో తీసుకొచ్చిన వేలకోట్ల రూపాయలను ఏమి చేశారని ప్రశ్నించారు. రోడ్లు బాగాలేవని మొక్కలు నాటి నిరసనలు తెలిపిన జనసేన నాయకులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. తక్షణమే నరసరావుపేట నియోజకవర్గంలోని రోడ్లన్నీ బాగు చేయాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో సుమారు 14 కోట్లు ఖర్చుపెట్టి లింగంగుంట్ల బైపాస్ దగ్గర నుంచి ఇస్సపాలెం బైపాస్ వరకు ఉన్న 11 కిలోమీటర్ల రోడ్డును నిర్మించామన్నారు. ఈ రెండున్నర కిలోమీటర్లు మాత్రమే నిధులు సరిపోక ఆపివేశామన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట వైసీపీ నాయకులు జడ్పీటీసీ వి.చిట్టిబాబు, వైసీపీ పట్టణ అధ్యక్షుడు కరీముల్లా, జొన్నలగడ్డ సర్పంచ్ చిన్న, పాలపాడు ఎంపీటీసీ మెట్టు రామిరెడ్డి ఆలూరువారిపాలెం సర్పంచ్ బి.నర్సిరెడ్డి, వెంకటప్పరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మండల పరిషత్ కార్యాలయంలో చోరీకి యత్నం

శావల్యాపురం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో గుర్తుతెలియని వ్యక్తులు అర్ధరాత్రి సమయంలో కార్యాలయంలోకి ప్రవేశించి చోరీకి ప్రయత్నించిన ఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గుర్తుతెలియని వ్యక్తులు కార్యాలయంలోకి ప్రవేశించి బోరింగ్ సామగ్రి భద్రపరిచేగది, ఉపాధి హామీ కార్యాలయం గదిలో సంచరించినట్లు సిబ్బంది గుర్తించారు. దీనిపై సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## రైతులు పంట బీమా చేయించుకోవాలి: ఏఈవో

యడ్లపాడు, జులై 29 (ఆంధ్రజ్యోతి): రైతులు పంటలను తప్పనిసరిగా బీమా చేయించుకోవాలని ఏఈవో ప్రసన్నకుమార్ అన్నారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మండంలోని కారుచోల, గుత్తావారిపాలెం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. పంటల బీమా పథకం, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాల గురించి రైతులకు అవగాహన కల్పించారు. పత్తి ఎకరాకు రూ.1,900 ప్రీమియం చెల్లిస్తే ప్రకృతి వైపరీత్యాలు, వాతావరణంలో మార్పుల కారణంగా నష్టపోతే రూ.38వేలు బీమాకింద రైతులకు చెల్లిస్తారన్నారు. ప్రీమియం చెల్లింపులకు వరికి ఆగస్టు 15వరకు, మిగిలిన పంటలకు గడువు ఈ నెల 31న ముగుస్తుందన్నారు. ఏఈవో జీవన్ నాయక్, వ్యవసాయ సహాయకులు శ్రీలత పాల్గొన్నారు.

## 100 కుటుంబాలను దత్తత తీసుకుంటా

● చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

శావల్యాపురం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేదరికాన్ని రూపుమాపేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు పీ4 విధానంలో 250 నిరుపేద కుటుంబాలను దత్తత చేసుకున్నారని ఆయన స్ఫూర్తితో తాను వినుకొండ నియోజకవర్గంలోని 100 నిరుపేద కుటుంబాలను దత్తత తీసుకోబోతున్నానని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు ప్రకటించారు. శావల్యాపురం సొసైటీ కార్యాలయంలో జరిగిన నూతన పాలకవర్గసభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవం సభావేదికపై సోమవారం జీవీ ఈ విషయాన్ని ప్రకటించారు. మంగళవారం జీవీ దీనిపై మాట్లాడుతూ వినుకొండ నియోజకవర్గంలో 12వేలమంది నిరుపేదలు ఉన్నారని, వారంతా సొంత ఇళ్లుగానీ, పొలంగానీ లేక పేదరికంలో ఉన్నారన్నారు. చంద్రబాబు ప్రవేశపెట్టిన పీ4 విధానానికి ప్రతిఒక్కరూ తమవంతు సహకారాన్ని అందించి పేదలను ఆదుకోవాలని, ఆర్థిక స్థోమతను బట్టి ప్రతిఒక్కరూ కొన్ని నిరుపేద కుటుంబాలను దత్తత తీసుకోవాలని పిలుపునిచ్చారు. జగన్‌రెడ్డికి గత ఎన్నికల్లో 11సీట్లు మాత్రమే ఇచ్చి ప్రజలు బుద్ధి చెప్పినా ఆయన తీరు మారలేదన్నారు.

## పల్నాడు జిల్లా రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశం



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ

నర్సరావుపేట లీగల్, జులై 29, (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో మంగళవారం జిల్లా రోడ్ సేఫ్టీ కమిటీ ఛైర్మన్ కలెక్టర్ పి.అరుణ్ బాబు ఆధ్వర్యంలో రోడ్ సేఫ్టీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎస్పీ యాక్సిడెంట్స్ డేటాను పరిశీలించి ప్రమాదాల నివారణకు పలు సూచనలు చేశారు. గుర్తించిన బ్లాక్ స్పాట్లలో సంబంధిత డిపార్టుమెంట్ అధికారులు తక్షణం చర్యలు తీసుకోవాలని సూచించారు. రొంపిచర్ల వద్ద ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని నామ్ హైవేపై ఫ్లైఓవర్ నిర్మాణానికి అవకాశాలను పరిశీలించాలని ఇంజినీరింగ్ అధికారులను కలెక్టర్ కోరారు. అనంతరం నోడల్ అధికారి యాప్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు, పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు, జిల్లా రవాణా శాఖ అధికారి సంజీవ కుమార్, రవాణా శాఖ అధికారులు, మెడికల్ ఆఫీసర్ రవి, ఆర్ అండ్‌బీ ఈఈ, ఆర్టీసీ ఆర్.ఎం అజితకుమారి, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### మాదక ద్రవ్య నిరోధక సమన్వయ కమిటీ సమావేశం

నరసరావుపేట లీగల్, జులై 29, (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాల్లో మంగళవారం మాదకద్రవ్యాల నిరోధక సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు అధ్యక్షత వహించారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా గుర్తించిన గంజాయి హాట్‌స్పాట్‌లపై పోలీసుల నిఘా ఏర్పాటు చేసినట్లు, మాదకద్రవ్యాల సంబంధిత కార్యకలాపాల్లో ఉన్న అనుమానిత వ్యక్తుల నివాస ప్రాంతాలను అధికారులు తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు.

## చెలరేగిపోతున్న అంగరక్షకుడు

● వైసీపీ హయాంలో ఖాళీ స్థలం కబ్జా...టీడీపీ నేతకు బెదిరింపులు


నాదెండ్ల, జులై 29 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో అధికారాన్ని అడ్డుపెట్టుకొని రైతు స్థలం ఆక్రమించి రోడ్డు వేసిన అంగరక్షకుడు ఇప్పుడు కూడా అధికారాన్ని అడ్డుపెట్టుకొని రెచ్చిపోతున్నాడు. అధికారంలో ఏ ప్రభుత్వం ఉంటే ఆ పాలకుల అండదండలు చూసుకొనే ఎమ్మెల్యే అంగరక్షకుడు మండలంలోని కనపర్రు గ్రామంలో భూకబ్జాకు తెరతీశాడు. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రైతు పూదోట ప్రకాశరావుకు వారసత్వంగా ఆస్తి సంక్రమించింది. ఆరు సంవత్సరాల క్రితం నరసరావుపేట వైసీపీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి వద్ద గన్‌మెన్‌గా పనిచేసిన వ్యక్తి ఆ రైతుకు చెందిన కొంత స్థలాన్ని ఆక్రమించి తన అత్తగారింటికి అక్రమంగా రోడ్డు వేశాడు. మొన్నటి వరకు వైసీపీ ఎమ్మెల్యే అండ ఉండటంతో ప్రకాశరావుకు ధైర్యం లేక కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే న్యాయం చేయాలని అధికారులకు విన్నవించుకున్నాడు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం పోలీసులు, గ్రామ పెద్దలు, పంచాయతీ కార్యదర్శి సమక్షంలో అధికారులు సర్వేచేసి, కబ్జాకు గురైన స్థలం చుట్టూ సర్వే హద్దురాళ్ళు ఏర్పాటు చేయించారు. ప్రస్తుతం అధికార పార్టీ ఎమ్మెల్యే వద్ద గన్‌మెన్‌గా పనిచేస్తున్న వ్యక్తి తిరిగి పైరవీలు చేసి సోమవారం రాత్రికి రాత్రే సర్వే హద్దురాళ్ళను తొలగించారు. అంతేకాకుండా పంచాయతీ కార్యదర్శిని పిలిపించి జిల్లా అధికారి మందలించేలా ఆ గన్‌మెన్ చక్రం తిప్పాడు. అంతేకాదు ఈ వ్యవహారంలో పెద్ద మనిషిగా వ్యవహరిస్తున్న టీడీపీ నేతను ఫోన్‌లో బెదిరించాడు. గన్‌మెన్ అరాచకాలపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకుడు పోలీసులను ఆశ్రయించినట్లు తెలిసింది.



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సుబ్బరాయగుప్తా తదితరులు

## తైక్వాండోలో ఎస్‌ఎస్‌ఎన్ విద్యార్థుల ప్రతిభ

నరసరావుపేట టౌన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఓపెన్ క్యోరుగి అండ్ తైక్వాండో చాంపియన్‌షిప్-2025లో ఎస్‌ఎస్‌ఎన్ కళాశాల విద్యార్థులు మూడు కాంస్య పతకాలు సాధించారని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంఎస్ సుధీర్ మంగళవారం తెలిపారు. కృష్ణా జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడ చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో జరిగిన ఈ 10 జాతీయ జూనియర్ అండ్ సీనియర్ పోటీలలో ఈ ఘనత సాధించారన్నారు. అండర్-17 విభాగం 73కేజీల క్యాటగిరిలో ఎం.సాయి శ్రీకర్ రెండు కాంస్య పతకాలు, ఓపెన్ క్యాటగిరి 46 కేజీ విభాగంలో వీ తులసీ తన్మయ్ కాంస్య పతకం సాధించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, మాజీ మున్సిపల్ ఛైర్మన్, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ నాగసరపు సుబ్బరాయగుప్తా, జాయింట్ సెక్రటరీ వూటుకూరి వెంకట అప్పారావు, పీడీ డాక్టర్ యక్కల మధుసూదనరావు, ఏవీఎస్ గుప్త అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.



పతకాలు సాధించిన విద్యార్థులతో హెచ్‌ఎం ఎం.పార్వతి, పీడీ వీ పద్మావతి తదితరులు

## ఎస్‌బీపురం విద్యార్థికి సిల్వర్ మెడల్

నరసరావుపేట టౌన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో తైక్వాండోలో ఎస్‌బీ పురం జడ్పీ స్కూల్ విద్యార్థి సిల్వర్ మెడల్ సాధించారని హెచ్‌ఎం ఎం.పార్వతి మంగళవారం తెలిపారు. విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగిన జాతీయ స్థాయి తైక్వాండో పోటీలలో టీ దేవరాజ్ సిల్వర్ మెడల్ సాధించారన్నారు. రేపల్లెలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో తైక్వాండోలో జాన్‌పాల్ గోల్డ్ మెడల్ సాధించారన్నారు. విద్యార్థులను పీడీ వీ పద్మావతి, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.